teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు...
తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 04 | సంచిక : 157 | ఛీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | బుధవారం | 3 డిసెంబర్ 2025 | పేజీలు : 08 | వెల ₹5

Published rom Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar, Nizamabad, Adilabad.

## సంచార్ సాథీపై కేంద్రం యూటర్న్

విపక్షాల సెగతో దిగొచ్చిన సర్కార్
మొబైల్స్‌లో ఆ యాప్‌ను డిలీట్ చేసుకోవచ్చు

05




## పంచాయతీ పోరులో వింత పోకడలు

### పదవి కోసం వేలం పాటలు.. బాండ్ పేపర్లపై హామీలు

- ఎమ్మెల్యేలను మించిన మేనిఫెస్టోలు
- నల్గొండలో రూ. 73 లక్షల వేలం పాటతో సర్పంచ్ ఏకగ్రీవం?
- అప్పుల ఊబిలో కూరుకుపోవద్దు
- హెచ్చరిస్తున్న మాజీ సర్పంచులు




తెలంగాణ బ్యూరో, డిసెంబర్ 02 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో పంచాయతీ పోరు హీటెక్కుతోంది. గెలుపు కోసం అభ్యర్థులు హామీల వర్షం కురిపిస్తున్నారు. రాజకీయ జీవితంలో సర్పంచ్ పదవి మొదటి అడుగు కావడంతో ఈ అవకాశాన్ని వదులుకోవద్దని అభ్యర్థులు గెలుపు కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ పోటీలో గెలుపు తప్ప ఓటమి ఉండకూడదని ఏకగ్రీవం

మిగతా 2 లో







# పల్లెల్లో ఎలక్షన్ జోష్

## పతాక స్థాయికి చేరిన పంచాయతీ పోరు

- నేటి నుంచి మూడో విడత
- ముగిసిన రెండో విడత నామినేషన్ల ప్రక్రియ
- 4,333 పంచాయతీలకు 12 వేల నామినేషన్లు దాఖలు
- ముమ్మరంగా సాగుతున్న ప్రచారం
- ఓటర్లకు గాలం వేస్తున్న అభ్యర్థులు
- డిసెంబర్ 4న తొలి విడత అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు



తెలంగాణ పల్లెల్లో పంచాయతీ ఎన్నికల నగారా మోగడంతో రాజకీయ వాతావరణం వేడెక్కింది. రాష్ట్రవ్యాప్తంగా మూడు విడతలుగా జరుగుతున్న సర్పంచ్ ఎన్నికల ప్రక్రియలో కీలక ఘట్టమైన రెండో విడత నామినేషన్ల పర్వం మంగళవారం సాయంత్రంతో ముగిసింది. పల్లె పోరులో గెలుపే లక్ష్యంగా ఆశావహులు పోటీపడటంతో నామినేషన్ కేంద్రాలు కిటకిటలాడాయి.

02



## పీఎంవో ఇక నుంచి సేవా తీర్థ్

వలస పాలన ఆనవాళ్లు చెరిపేస్తున్న మోదీ సర్కార్
పాలనలో సేవా స్ఫూర్తిని నింపేందుకేనని కేంద్రం వెల్లడి

.. వివరాలు 2లో



## గ్రూప్-2 కేసులో హైకోర్టు కీలక ఆదేశాలు

స్టే కొనసాగింపు.. తొలగని ఉత్కంఠ
సింగిల్ బెంచ్ తీర్పును సవాల్ చేసిన గ్రూప్-2 అధికారులు

.. వివరాలు 2లో



## మళ్లీ మొదలైన న్యాయ గంట

ఒక్క ఫోన్ కాల్‌తో భూ సమస్యలకు పరిష్కారం
తెలుగు రాష్ట్రాల రైతులకు ఉచితంగా న్యాయ సలహాలు
రెవెన్యూ నిపుణుడు భూమి సునీల్ ఆధ్వర్యంలో కార్యక్రమం


.. వివరాలు 2లో

## ఉద్యోగులకు షాక్

### "సర్కార్ సంచలన నిర్ణయం"

- కంప్యూటర్ రాకపోతే కొలువు గోవిందా..?
- కీలక విభాగాల ఉద్యోగులకు కంప్యూటర్ టెస్ట్ తప్పనిసరి
- కారుణ్య నియామకాల్లో చేరిన వారికీ వర్తింపు
- జీఓ జారీ.. స్పష్టం చేసిన ప్రభుత్వం

02

## ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్

- సైబర్ నేరాల కట్టడికి పోలీసుల కొత్త అస్త్రం
- దేశవ్యాప్తంగా పెరిగినా రాష్ట్రంలో తగ్గుముఖం
- తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి వెల్లడి



హైదరాబాద్, డిసెంబర్ 02 (తీన్మార్ న్యూస్): దేశవ్యాప్తంగా గతేడాది సైబర్ నేరాలు పెరిగితే తెలంగాణలో మాత్రం తగ్గాయని డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు. మనం అప్రమత్తమైతే సైబర్ నేరాల బారిన పడకుండా కాపాడుతుందని అన్నారు. మంగళవారం సైబర్ నేరాలపై అవగాహనకు రాష్ట్ర సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో చేపట్టిన 'ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్' కార్యక్రమాన్ని డీజీపీ ప్రారంభించారు. ఆరు వారాల పాటు ఈ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన డీజీపీ

మిగతా 2 లో



దేశానికి విజ్ఞాన దిక్సూచిగా

## ఎర్త్ సైన్సెస్

- భద్రాద్రిలో ఎర్త్ సైన్సెస్ వర్సిటీకి శంకుస్థాపన
- మన్మోహన్ సింగ్ పేరుతో అంతర్జాతీయ స్థాయి నిర్మాణం
- త్వరలోనే అందుబాటులోకి: డిప్యూటీ సీఎం భట్టి

.. వివరాలు 6లో

## మెస్సీతో సై అంటే.. సై..




మైదానంలోకి దిగిన సీఎం రేవంత్ రెడ్డి
ఉప్పల్ స్టేడియంలో ఆసక్తికర పోరు
మెస్సీ టీమ్‌తో తలపడనున్న సీఎం టీమ్
13న మ్యాచ్
ఎంసీహెచ్ఆర్డీ గ్రౌండ్స్‌లో సీఎం కఠిన సాధన

02

## డిసెంబర్ 9 డెడ్‌లైన్...

- లేదంటే తర్వాత జరిగేది భూపోరాటమే
- ప్రభుత్వ భూముల్లో జాగృతి జెండాలు పాతేస్తాం
- రేవంత్ సర్కార్‌కు కవిత మాస్ వార్నింగ్

05





దేశానికి అన్నపూర్ణగా

## తెలంగాణ

- ధాన్యం ఉత్పత్తిలో నంబర్ వన్
- 220.77 లక్షల ఎకరాలకు పెరిగిన సాగు విస్తీర్ణం
- పత్తి ఉత్పత్తిలోనూ వృద్ధి
- 30.24 లక్షల టన్నులకు చేరిన దిగుబడి

05





# పల్లెల్లో ఎలక్షన్ జోష్




తెలంగాణ బ్యూరో, డిసెంబర్ 02 (తీన్మార్ న్యూస్): తెలంగాణ పల్లెల్లో పంచాయతీ ఎన్నికల నగారా మోగడంతో రాజకీయ వాతావరణం వేడెక్కింది. రాష్ట్రవ్యాప్తంగా మూడు విడతలుగా జరుగుతున్న సర్పంచ్ ఎన్నికల ప్రక్రియలో కీలక ఘట్టమైన రెండో విడత నామినేషన్ల పర్వం మంగళవారం సాయంత్రంతో ముగిసింది. పల్లె పోరులో గెలుపే లక్ష్యంగా ఆశావహులు పోటీపడటంతో నామినేషన్ కేంద్రాలు కిటకిటలాడాయి.

**భారీగా దాఖలైన నామినేషన్లు**

రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల ప్రక్రియ శరవేగంగా సాగుతోంది. రెండో విడతలో మొత్తం 4,333 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరగనుండగా, ఆశావహుల నుంచి భారీ స్పందన లభించింది. వీటికి సంబంధించి దాదాపు 12 వేలకు పైగా నామినేషన్లు దాఖలైనట్లు ప్రాథమిక సమాచారం. ఒక్కో పంచాయతీకి సగటున ముగ్గురు నుంచి నలుగురు అభ్యర్థులు పోటీకి సై అంటున్నారు.

**ఎన్నికల షెడ్యూల్ ఇలా..**

ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం.. మొదటి విడత సర్పంచ్ ఎన్నికల పోలింగ్ ఈనెల 11న జరగనుండగా, రెండో విడత పోలింగ్ 14న నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. తొలి విడత బరిలో ఉన్న అభ్యర్థులకు ఈనెల 4న (బుధవారం) ఎన్నికల సంఘం గుర్తులను కేటాయించనుంది. గుర్తులు చేతికి వచ్చిన వెంటనే ప్రచారాన్ని మరింత ఉధృతం చేసేందుకు అభ్యర్థులు సిద్ధమవుతున్నారు.

**ఓటర్లకు తాయిలాలు.. ఏరులై పారుతున్న మందు**

మరోవైపు పల్లెల్లో ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. అభ్యర్థులు ఇంటింటి ప్రచారం చేస్తూ ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. గ్రామాల్లో విందు, వినోదాలకు తెరలేచింది. ఇప్పటికే తమ వర్గాలను, ఓటర్లను కాపాడుకునేందుకు అభ్యర్థులు మందు, మాంసం భారీగానే పంచుతున్నట్లు తెలుస్తోంది. పల్లెల్లో డబ్బు ఏరులై పారుతోందని, ఓటుకు రేటు కట్టి మరీ పంచుతున్నారని సామాన్యులు చర్చించుకుంటున్నారు.

**నేటి నుంచి మూడో విడత**

ఇదిలా ఉండగా.. నేటి (బుధవారం) నుంచి మూడో విడత ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ల ప్రక్రియ కూడా ప్రారంభం కానుండటంతో గ్రామీణ రాజకీయాలు మరింత రసవత్తరంగా మారాయి. ఇప్పటికే రెండు విడతల సందడి నెలకొనగా, మూడో విడత నామినేషన్లు తోడవడంతో రాష్ట్రమంతటా పల్లెలు ఎన్నికల జాతరను తలపిస్తున్నాయి.

## ఉద్యోగులకు షాక్



హైదరాబాద్, డిసెంబర్ 02 (తీన్మార్ న్యూస్): తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై ప్రభుత్వ శాఖల్లోని కొన్ని విభాగాల్లో పని చేస్తున్న ఉద్యోగులకు కంప్యూటర్ పరీక్ష తప్పనిసరి చేసింది. వారందరూ కంప్యూటర్ పరీక్షకు హాజరవడమే కాదు. అందులో ఖచ్చితంగా ఉతీర్ణత కావాల్సిందే. ఉతీర్ణత కాని వాళ్లందరినీ ఇంటికి పంపనుంది సర్కార్. కంప్యూటర్ పరీక్ష ఉత్తీర్ణతతోపాటు ఆఫీసు ఆటో మెషిన్ ప్రావీణ్యం కూడా తప్పనిసరి చేసింది. కాగా ఇందుకు సంబంధించిన డిపార్ట్మెంటల్ పరీక్షలో ఉత్తీర్ణులు కావాలని %+.వా%.237 జారీ చేసింది. అయితే ఈ నిబంధన ప్రభుత్వ కార్యాలయాల్లో పని చేస్తున్న జూనియర్ అసిస్టెంట్లు, అసిస్టెంట్ కమ్ టైపిస్టులు, సీనియర్ స్టెనోగ్రాఫర్లు, జూనియర్ స్టెనోగ్రాఫర్లు, యూ.డి టైపిస్టులు, టైపిస్టులు, ఎల్.డి. టైపిస్టులు మొదలైన కేటగిరీల వారికి వర్తిస్తుందని జీవోలో పేర్కొంది. అయితే కొందరు కారుణ్య నియామకాల వంటి వివిధ కారణాలతో ఈ ఉద్యోగాలకు ఎన్నికైన వారుండగా ఇకపై వారంతా కంప్యూటర్ నాలెడ్జ్ కలిగి ఉండాలనే ఆశయంతో ప్రభుత్వం ఈ నియమం తీసుకు వచ్చిందని అధికారులు చెబుతున్నారు.

## మెస్సీతో సై అంటే.. సై..



హైదరాబాద్, డిసెంబర్ 02 (తీన్మార్ న్యూస్): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాజకీయాలలో తిరుగులేని డెసిసిన్స్ తో ప్రతిపక్షాలను ఆడుకుంటున్న నేపథ్యంలో ఇప్పుడు ప్రపంచ ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సీ తో నిజమైన ఫుట్‌బాల్ మ్యాచ్ ఆడేందుకు సిద్ధమయ్యారు. అర్జెంటీనా స్టార్ ప్లేయర్ మెస్సీని ఢీకొట్టేందుకు సీఎం రేవంత్ రెడ్డి తీవ్రంగా ప్రాక్టీస్ మొదలుపెట్టారు. భారత పర్యటనలో భాగంగా అర్జెంటీనా ఆటగాడు లియోనెల్ మెస్సీ ఈ నెల డిసెంబర్ 13న హైదరాబాద్ నగరానికి విచ్చేయనున్నారు. అదే రోజున మెస్సీ, సీఎం రేవంత్ రెడ్డితో ప్రత్యేకంగా భేటీ కానున్నారు. ఆ తరువాత డిసెంబర్ 13న సాయంత్రం ఉప్పల్ మైదానంలో లియోనెల్ మెస్సీ టీమ్‌తో సీఎం రేవంత్ రెడ్డి టీమ్ మధ్య ఫ్రెండ్లీ ఫుట్‌బాల్ మ్యాచ్ జరగనుంది. ఈ అంతర్జాతీయ దిగ్గజ ఆటగాడితో తలపడటానికి సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటి నుంచే కసరత్తు మొదలుపెట్టారు. ఈ ఫ్రెండ్లీ మ్యాచ్ కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్‌లోని ఎంసీహెచ్ఆర్డీ గ్రౌండ్స్‌లో ఆటగాళ్లతో కలిసి తీవ్రంగా సాధన చేస్తున్నారు. సీఎంవో కార్యాలయం ఈ ప్రాక్టీస్‌కు సంబంధించిన ఫోటోలు, వీడియోలను సోషల్ మీడియా వేదికగా పంచుకోవడంతో అవి వైరల్‌గా మారాయి. ఈ మ్యాచ్ గురించి సీఎం రేవంత్ రెడ్డి సోషల్ మీడియా ద్వారా పోస్ట్ చేస్తూ "క్రీడా స్ఫూర్తి.. తెలంగాణ కీర్తి. ఈ నెల 13న ప్రపంచ ప్రముఖ ఫుట్‌బాల్ క్రీడాకారుడు మెస్సీతో ఆడేందుకు ప్రాక్టీస్ ప్రారంభించాను. 'తెలంగాణ రైజింగ్ – 2047' విజన్‌ను క్రీడా వేదిక నుంచి మెస్సీ సహకారంతో ప్రపంచానికి మరింతగా పరిచయం చేయాలన్న వ్యూహాత్మక ఆలోచనతో క్రీడా మైదానంలోకి స్వయంగా దిగానని పేర్కొన్నారు. మెస్సీని హైదరాబాద్‌కు ఆహ్వానించడానికి, భేటీ అవ్వడానికి ఎదురుచూస్తున్నట్లు కూడా ఆయన తెలిపారు.


## పంచాయతీ పోరులో వింత పోకడలు

మొదటి పేజీ తరువాయి

చేసుకునేందుకు గ్రామస్తులను హామీలతో ఆకట్టుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. తమపై నమ్మకం కలిగేలా ఏకంగా బాండ్ పేపర్లు సైతం రాసిస్తున్నారు. ఈ క్రమంలో సర్పంచ్ పదవి కోసం గ్రామస్తుల సమక్షంలో ఆశావహులు, అభ్యర్థులు వేలం పాటలకు రెడీ అవుతున్నారు. తమను ఏకగ్రీవంగా ఎన్నుకుంటే చేయబోయే గ్రామానికి చేయబోయే పనులు ఇవేనంటూ ఒకరిని మించి మరొకరు హామీలు గుప్పిస్తున్నారు. దీంతో సోషల్ మీడియాలో అభ్యర్థుల హామీల జాబితాలు వైరల్‌గా మారాయి.

**ఎమ్మెల్యేల ఎన్నికలను తలదన్నేలా మేనిఫెస్టోలు:**

మారుతున్న కాలంతో పాటే సర్పంచ్ ఎన్నికల్లో ఇస్తున్న హామీల ట్రెండ్ కూడా మారిపోయింది. ఇప్పుడు పల్లెపోరులో అభ్యర్థులు ఇస్తున్న మేనిఫెస్టోలు ఎమ్మెల్యేల ఎన్నికలను తలదన్నేలా ఉన్నాయనే చర్చ జరుగుతోంది. స్థానిక సమస్యలతో పాటు కులాలు, మతాల వారీగా హామీలు ఇస్తునే సామాజిక అంశాలపై కూడా అభ్యర్థులు హామీలు గుప్పిస్తున్నారు. తమను గెలిపిస్తే చేయబోయే పనులు ఇవేనంటూ మేనిఫెస్టో అంశాలను సోషల్ మీడియాల్లో తెగ ప్రచారం చేస్తున్నారు. తనను గెలిపిస్తే గ్రామంలోని ఇంటింటికి రూ.5 లక్షల ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పిస్తానని అలాగే ఆడబిడ్డ పుడితే రూ. 5 వేలు, ఇల్లు కట్టుకునే వారికి రూ. 21 వేలు, పెళ్లికి పుస్తె, మట్టెలు ఇస్తానని రంగారెడ్డి జిల్లా కొత్తపేటలో ఓ అభ్యర్థి హామీలు ఇవ్వగా గద్వాల జిల్లా సల్కాపురంలో ఓ అభ్యర్థి గ్రామంలో ఉచిత అంబులెన్స్, గ్యాస్ సిలిండర్లు ఇస్తానని వంద రూపాయల బాండ్ పేపర్ పై ఏకంగా 22 హామీలు రాసి ఇచ్చాడు. తాను ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే సర్పంచ్ పదవి నుంచి తప్పుకుంటానని సైతం స్పష్టం చేశారు. దూరపు బంధువులు రాకముందే రక్షణగా మృతదేహాలకు రిఫ్రిజిరేటర్ సదుపాయం, మరణించిన కుటుంబానికి రూ. 3 వేల ఆర్థిక సాహాయం కల్పిస్తానంటూ ఖమ్మం జిల్లాలో ఓ మహిళా అభ్యర్థి పలు హామీలు ఇచ్చారు. ఇక ఖమ్మం జిల్లాలోని నేలకొండపల్లి మండలం ముటాపురం గ్రామానికి చెందిన ఓ అభ్యర్థి తనను గ్రామానికి సర్పంచ్‌గా ఏకగ్రీవం చేస్తే కోటి రూపాయలతో అభివృద్ధి పనులు చేస్తానని ప్రకటించాడు. అంతేగాకుండా ఊర్లోని వీరన్న సామి గుడికి ఎకరం భూమిని విరాళం ఇవ్వడంతో పాటు పలు సంక్షేమ కార్యక్రమాలు చేస్తానని బంపరాఫర్ ఇచ్చారు. ఉ



మ్మడి కరీంనగర్ జిల్లా కొత్తగట్టు సర్పంచ్ అభ్యర్థి మాడ స్వాతి వెంకట్‌రెడ్డి తాను గెలిస్తే నెల రోజుల్లో కోతుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తానంటూ తన మేనిఫెస్టోలోని మొదటి హామీగా ప్రకటించారు. నల్గొండ జిల్లా స్థానిక మండలంలోని బంగారిగడ్డ గ్రామ పంచాయతీలో సర్పంచ్ పదవికి వేలం పాట నిర్వహించగా రూ. 73 లక్షలతో మహమ్మద్ సమీనా ఖాసీం అనే అభ్యర్థి ఈ పోస్టును దక్కించుకున్నారు. ఇక్కడ 16 మంది పోటీలో ఉండగా వారంతా తమ నామినేషన్లు ఉపసంహరించుకుంటామని ప్రకటించారు.


**తాజా మాజీల హెచ్చరికలు:**

ఇలా గుడులు కట్టిస్తామని, కుల సంఘాలకు పైసలిస్తామని, యువత, మహిళలకు ప్రత్యేక హామీలు ఇస్తూ హోరెత్తిస్తుంటే మరో వైపు హామీలు ఇచ్చే ముందు అభ్యర్థులంతా ఒక్కసారి మా పరిస్థితి ఆలోచించుకోండంటూ తాజా మాజీ సర్పంచ్ లు హెచ్చరిస్తున్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే నిధుల కంటే సొంతంగా డబ్బులు ఇచ్చి పనులు చేయిస్తామని హామీలు ఇస్తుండటంతో గతంలో తాము సర్పంచ్ గిరి చేసి నిండా అప్పుల్లో మునిగిపోయామని ఎడాపెడా హామీలు ఇస్తూ, ఎన్నికల్లో గెలిచేందుకు ఇష్టారీతిగా ఖర్చులు చేసే ముందు ఆలోచించుకోవాలని రాజకీయ పదవుల కోసం మీ సొంత కుటుంబాలను ఆర్థికంగా ఇబ్బందుల్లోకి నెట్టుకోకండని సలహా ఇస్తున్నారు. మొత్తంగా పోటీ పడీ మేనిఫెస్టోలు ఇస్తున్న అభ్యర్థుల్లో ఎంత మంది గెలుస్తారు మరెంత మంది చేతులు కాల్చుకుంటారు అనేది కాలమే సమాధానం చెప్పనుంది.

## సంచార్ సాథీపై కేంద్రం యూటర్న్

న్యూ ఢిల్లీ, డిసెంబర్ 02 (తీన్మార్ న్యూస్): దేశంలో అమ్మే అన్ని మొబైల్‌ఫోన్‌లలో డీఫాల్ట్‌గా సంచార్ సాథీ యాప్ ఉండాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిన ఒకరోజు వ్యవధిలోనే నిర్ణయం మార్చుకుంది. దీనికి సంబంధించి ప్రతిపక్షాలు దీన్నొక నియంతృత్వ ధోరణిగా విమర్శలు చేయడంతో కేంద్ర కమ్యూనికేషన్ల మంత్రి జ్యోతిరాదిత్య సింధియా మంగళవారం మరో ప్రకటన ఇచ్చారు. ప్రభుత్వ 'సంచార్ సాథి' యాప్ వినియోగదారులకు తప్పనిసరి కాదని స్పష్టం చేశారు. వినియోగదారులు కావాలనుకుంటే దాన్ని వారి డివైజ్/మొబైల్స్ నుంచి తీసేయడానికి స్వేచ్ఛ ఉంటుందని పేర్కొన్నారు. ఈ యాప్, దాని లక్ష్యం అందరికీ చేరాలనేదే ప్రభుత్వం ఉద్దేశమని, దాన్ని మొబైల్స్‌లో ఉంచుకోవాలా లేదా అనేది కస్టమర్ల ఇష్టమని పార్లమెంటు వెలుపల సింధియా మీడియాతో చెప్పారు. స్మార్ట్‌ఫోన్ తయారీ కంపెనీలు యాప్‌ను ముందస్తుగా ఇన్‌స్టాల్ చేసుకోవాలని ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాన్ని కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రతిపక్షం విమర్శించిన తర్వాత మంత్రి ఈ వివరణ ఇచ్చారు. ఈ ఉత్తర్వులు ప్రజల గోప్యతను ఉల్లంఘిస్తుందని ప్రతిపక్షాలు చెబుతున్నాయి. సోమవారం దేశంలో విక్రయించే, తయారు చేసే లేదా దిగుమతి చేసుకున్న ప్రతి మొబైల్‌లోనూ సంచార్ సాథి యాప్‌ను డీఫాల్ట్‌గా ఇన్‌స్టాల్ చేయాలని అన్ని మొబైల్ తయారీ కంపెనీలను ఆదేశిస్తూ ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. నకిలీ మొబైల్ ఫోన్‌ల అమ్మకాలను ఆపడానికి, టెలికాం సేవల దుర్వినియోగాన్ని కనుగొనే ప్రయత్నాల్లో భాగంగా తీసుకున్న నిర్ణయమని పేర్కొంది.

## పీఎంవో ఇక నుంచి సేవా తీర్థ్



న్యూ ఢిల్లీ, డిసెంబర్ 02 (తీన్మార్ న్యూస్): ప్రధాని నరేంద్రమోడీ ప్రభుత్వం ఇటీవల కీలక నిర్ణయాలను తీసుకుంటుంది. వలసవాద పాలన అవశేషాలు కూడా మిగలకుండా పలు నిర్ణయాలను తీసుకుంది. తాజాగా ఢిల్లీలోని కొత్త ప్రధాని భవన సముదాయం పేరును మార్చారు. పీఎంఓ పేరును "సేవా తీర్థ్"గా మార్చారు. ఇటీవల, గవర్నర్ల అధికార నివాసమైన రాజ్ భవన్ పేరును లోక్ భవన్‌గా మార్చారు. సెంట్రల్ విస్టా ప్రాజెక్టులో భాగంగా కొత్తగా నిర్మిస్తున్న ప్రధాని కార్యాలయాన్ని ఇకపై సేవా తీర్థ్ గా పిలువనున్నారు. పాలనలో సేవా స్ఫూర్తిని ప్రోత్సహించడం కోసమే కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. ఇటీవల కాలంలో కేంద్రం దేశవ్యాప్తంగా అనేక ప్రభుత్వ భవనాలు, రోడ్ల పేర్లను మార్చింది. గతంలో ప్రధాని నివాసం ఉన్న మార్గాన్ని లోక్ కళ్యాణ్ మార్గ్ గా మార్చారు. ఢిల్లీలోని రాజ్ పథ్ ను కర్తవ్య పథ్ గా మార్చారు.


## గ్రూప్-2 కేసులో హైకోర్టు కీలక ఆదేశాలు

హైదరాబాద్, డిసెంబర్ 02 (తీన్మార్ న్యూస్): 2015–16లో నిర్వహించిన గ్రూప్–2 పరీక్షలలో ఓఎంఆర్ షీట్ల టాంపరింగ్ జరిగినట్లు ఆరోపణల నేపథ్యంలో, 2019లో విడుదల చేసిన సెలక్షన్ లిస్ట్‌ను రద్దు చేస్తూ హైకోర్టు సింగిల్ బెంచ్ ఇటీవల తీర్పు వెలువరించిన సంగతి తెలిసిందే. ఈ తీర్పును సవాల్ చేస్తూ, ఇప్పటికే గ్రూప్–2 హోదాలో విధులు నిర్వహిస్తున్న ఆరుగురు అధికారులు నవంబర్ 27న డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించారు. మంగళవారం ఈ అంశంపై విచారణ చేపట్టిన హైకోర్టు ధర్మాసనం, సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ దాఖలైన అప్పీలులపై డివిజన్ బెంచ్ జారీ చేసిన మధ్యంతర ఉత్తర్వులు యథావిధిగా కొనసాగుతాయని స్పష్టం చేసింది. నవంబర్ 24న దాఖలైన మరో అప్పీల్‌తో పాటు ఈ తాజా అప్పీలులను కలిపి విచారణ కొనసాగిస్తామని ధర్మాసనం వెల్లడించింది. సెలక్షన్ లిస్ట్ రద్దు నేపథ్యంలో ఉద్యోగాలు, ప్రమోషన్లు, సేవా నిర్ధారణ వంటి అంశాలపై ప్రభావం ఉండటంతో కేసు ప్రాధాన్యత సంతరించుకుంది.

## మళ్లీ మొదలైన న్యాయ గంట

తెలంగాణ బ్యూరో, డిసెంబర్ 02 (తీన్మార్ న్యూస్): రెండు తెలుగు రాష్ట్రాల రైతులు, భూ హక్కుదారులకు సమస్యల పరిష్కారం కోసం లీఫ్స్ సంస్థ న్యాయ గంట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నది. భూ సమస్యల పరిష్కారానికి ఉచితంగా సలహాలు పొందొచ్చు. ఎవరైనా ఫోన్ ద్వారా తమ సమస్యలు చెప్పుకుంటే రెవెన్యూ చట్టాలు, కోర్టుల ద్వారా ఏ విధంగా న్యాయం పొందొచ్చునో రెవెన్యూ చట్టాల నిపుణుడు, వ్యవసాయ కమిషన్ సభ్యులు ఎం.సునీల్ కుమార్(భూమి సునీల్) వివరిస్తారు. ఈ అవకాశం ప్రతి శనివారం సాయంత్రం 6 గంటల నుంచి ఏడు గంటల వరకు కొనసాగుతుంది. ఇప్పటికే 400 వారాలకు పైగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనివార్య కారణాల వల్ల నిలిచిన న్యాయ గంట కార్యక్రమాన్ని తిరిగి ప్రారంభించారు. ఈ అవకాశాన్ని రైతులు, పట్టాదారులు సద్వినియోగం చేసుకోవచ్చు. ప్రతి శనివారం ఈ కార్యక్రమం నిర్వహిస్తారు. భూమి సునీల్ తో న్యాయ గంట లైవ్ ఫోన్ ఇన్ కార్యక్రమం పేరిట నడుస్తున్నది. ఫోన్ చేసిన తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల రైతులకు వ్యవసాయ భూముల సమస్యలకు న్యాయ సలహాలు అందించనున్నారు. ఫోన్ చేయాల్సిన నంబరు 90635 71205. పాత పట్టాదారు పాసుపుస్తకం, భూ యాజమాన్య హక్కు పత్రం ఉండి కొత్త పాసు పుస్తకం రాకపోయినా, ఓఆర్సీ ఉండి పాసు పుస్తకం రాకపోయినా పరిష్కారం ఎట్లా అన్నది తెలుసుకోవచ్చు. అలాగే లావుని పట్టా భూములకు పాసు పుస్తకం రాకపోయినా, 38ఈ సర్టిఫికేట్ ద్వారా హక్కులు పొందడం, వ్యవసాయ భూమి 'నాలా' అని నమోదు అయినప్పుడు ఏం చేయాలి వంటి ప్రశ్నలకు సమాధానాలు తెలుసుకోవచ్చు. పట్టా భూమిని అసైన్ / ప్రభుత్వ / సీలింగ్ / వక్ఫ్ / దేవాదాయ భూమి అని నిషేధిత జాబితాలో చేర్చినప్పుడు ఎవరిని సంప్రదించాలి? ఒక సర్వే నంబర్ లో కొంత అసైన్స్ / ప్రభుత్వ / సీలింగ్ / దేవాదాయ భూమి ఉండగా ఆ సర్వే నంబరులోని మొత్తం విస్తీర్ణాన్ని నిషేధిత జాబితాలో పేర్కొన్నప్పుడు ఎలా దరఖాస్తు చేసుకోవాలి? భూ సేకరణలో పోయిన దాని కంటే ఎక్కువ భూమిని రికార్డుల నుంచి తొలగించినప్పుడు, ఒకరి భూమి భూసేకరణలో పోతే వేరొకరి భూమిని రికార్డుల నుంచి తొలిగించినప్పుడు పరిష్కార మార్గాలేమిటో తెలుసుకోవచ్చు. ఇలాంటి అనేక సమస్యల పరిష్కారానికి ఎలా దరఖాస్తు చేసుకోవాలో, ఏ అధికారిని సంప్రదించాలో న్యాయ గంట ద్వారా సూచనలు పొందొచ్చు. అలాగే ఏయే పత్రాలు జత చేయాలో కూడా అర్థం చేసుకోవడానికి ఈ కార్యక్రమం దోహదపడుతుంది.

## ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్




మొదటి పేజీ తరువాయి

సమాజంలో ప్రమాదకరంగా ఉన్న నేరం సైబర్ క్రైమ్ అని పదేళ్ల క్రితం బందిపోట్లు, డెకాయిటి, దొంగతానాలు, పెద్ద నేరాలు జరిగేవి కానీ ఇటీవల సైబర్ క్రైమ్ పెద్ద పీడగా మారిందన్నారు. పేద, ధనిక తేడా లేకుండా అందరూ సైబర్ నేరాలకు గురవుతున్నారని సెల్ ఫోన్ లో ఒక్క క్లిక్ తో ప్రజల డబ్బులు కాజేస్తున్నారన్నారు. అత్యాశకు పోయి చాలా మంది సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకుంటున్నారని సైబర్ నేరాల పట్ల అలర్ట్ గా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా టీజీ సీఎస్ బీ డైరెక్టర్ శిఖాగోయల్ మాట్లాడుతూ తెలంగాణలో బాధితులు రోజుకు రూ.4 కోట్ల సైబర్ మోసాల ద్వారా కోల్పోతున్నారని చెప్పారు. ఇప్పటి వరకు సైబర్ నేరగాళ్లు కాజేసిన రూ. 350 కోట్లను బాధితులకు రీఫండ్ చేశామన్నారు.

# తెలంగాణ రాజ్యాధికార పార్టీ సర్పంచ్ అభ్యర్థి నామినేషన్



టేకుమట్ల, డిసెంబర్ 02 (తీన్మార్ న్యూస్): జయశంకర్ భూపాలపల్లి జిల్లా, టేకుమట్ల మండలం, కలికోటపల్లి గ్రామంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ సర్పంచ్ అభ్యర్థి నామినేషన్ వేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధ్యక్షుడు రవి పటేల్ పాల్గొని, సర్పంచ్ అభ్యర్థి చింతల సుజాత రాములకు నామినేషన్ పత్రాలు అందజేసి అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే ఐదుగురు వార్డు సభ్యులకు కూడా నామినేషన్ పత్రాలు అందజేయడం జరిగింది. అనంతరం రవి పటేల్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో బీసీల కోసమే పుట్టిన మొట్టమొదటి పార్టీ టీ ఆర్ పీ. మా పార్టీ ప్రధాన లక్ష్యం పేద, బడుగు, బలహీన వర్గాలకు విద్య, వైద్యం, సత్వర న్యాయం అందించటం. భూమిలేని నిరుపేద కుటుంబాలకు రెండు ఎకరాల భూమి కల్పించడం మా సంకల్పం. బహుజనుల ఆశయాలకు అనుగుణంగా పార్టీ పనిచేస్తుంది. విద్య, వ్యాపారం, రాజకీయ, సామాజిక%-%ఆర్థిక రంగాల్లో అభివృద్ధి సాధించాలంటే తప్పనిసరిగా టీఆర్పీ పార్టీని ప్రజలు గెలిపించాలని కోరుతున్నాం. అని అన్నారు. ఈ కార్యక్రమంలో టీఆర్పీ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిట్టల వెంకటేష్, నాయకులు ఎస్.పీ.కే. సాగర్, ప్రణీత్, సయ్యద్ సలీం, మండల నాయకులు అఖిల్, అక్షయ్, అలాగే గ్రామ నాయకులు పాల్గొన్నారు

# అన్యాయం జరుగుతే సహించేది లేదు



భూపాలపల్లి, డిసెంబర్ 02 (తీన్మార్ న్యూస్): మంగళవారం తెలంగాణ రాజ్యాధికార పార్టీ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు రవి పటేల్, సాగర్ జిల్లా వ్యాప్తంగా పలు కార్యక్రమాలలో హాజరవడం జరిగింది. భూపాలపల్లి కలెక్టర్ ఆఫీస్ ముందు ప్రెస్ మీట్ నిర్వహించడం జరిగింది. రెడ్డి గాండ్ల సంబంధించి కాటారం డివిజన్లో 13 బీసీ సర్టిఫికెట్లు జారీ చేసినందున వాటిని వెంటనే రద్దు చేయాలని బీసీలకు అన్యాయం జరుగుతే సహించేది లేదని హెచ్చరించారు. జర్నలిస్టులు చేస్తున్న రిలే నిరాహార దీక్షకు 13వ రోజు తెలంగాణ రాజ్యాధికార పార్టీ మద్దతు ఇవ్వడం జరిగింది వారి సమస్యను వెంటనే పరిష్కరించాలని రవి పటేల్ డిమాండ్ చేయడం జరిగింది. చిట్యాల లో కోడెల సమ్మయ్య నిన్న పరమాపదించడం జరిగింది, వారి పార్దివ దేహానికి పూలమాలయం ఘనంగా నివాళు లర్పించడం జరిగింది. ఈ కార్యక్రమాలలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ నాయకులు శ్రీకాంత్ శ్రీధర్ సమ్మయ్య సాయి సలీం పాషా ప్రణీత్ తదితరులు పాల్గొన్నారు.

# ఒకటో వార్డులో నెలకొన్న పలు సమస్యలపై కమిషనర్ కు వినతి



పరకాల, డిసెంబర్ 02 (తీన్మార్ న్యూస్): ఒకటో వార్డులో నెలకొన్న పలు సమస్యలపై కమిషనర్ సోమిడి. అంజయ్యకి వినతి పత్రం అందజేసిన స్థానిక మాజీ కౌన్సిలర్ మడికొండ. సంపత్ కుమార్ వార్డులో శానిటేషన్ పనులు సక్రమంగా జరిగేలా చూడాలని, వార్డులోని ప్రజలు ఆరోగ్యకరమైన, పరిశుభ్రమైన వాతావరణంలో నివసించేలా చూడాలని కోరినారు. డిసెంబర్ 6 భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకొని సీ ఎస్ ఐ ఎస్సీ కాలనీ అంబేద్కర్ జంక్షన్ లో శానిటేషన్ పనులు చేపించాలని కోరినారు. డిసెంబర్ 25 క్రీస్తు జన్మదిన వేడుకలు క్రిస్టమస్ ను పురస్కరించుకొని, మరియు నూతన సంవత్సర 2026 వేడుకలను పురస్కరించుకొని సి ఎస్ ఐ సెయింట్ పాల్ చర్చ్ పరిసర ప్రాంతాలలో శానిటేషన్ పనులు చేపించాలని, బస్టాండ్ సమీపంలో క్రిస్టమస్ స్టార్ ఏర్పాటు చేయాలని, సి ఎస్ ఐ సెయింట్ పాల్ చర్చ్ ప్రాంగణంలో సిరీస్ బల్బులు వేయించాలని కమిషనర్ ని స్థానిక మాజీ కౌన్సిలర్ కోరినారు.

# కూటి కోసం కోటి విద్యలు

### తన పాట తనకు ప్రాణం

### అందుని కంఠంలో గేయాలు

### రోడ్లపై జీవనోపాధికి అందుడు ఆరాటం



మహబూబ్ నగర్, డిసెంబర్ 02 (తీన్మార్ న్యూస్): తన పాట తనకు ప్రాణం రెండు కళ్ళు కోల్పోయి భార్యతో పాటు తాళి కట్టిన భార్యను పోషించవలసిన బాధ్యత కలిగిన తన భుజస్కంధాలపై ఇంతైనా ఉందని ఏది ఏమైనా కూడా తన గళం తన పాట తమకు ప్రాణం పోస్తుందని భావిస్తూ వర్షాకాలం చలికాలం, ఎండాకాలం లెక్కచేయకుండా రోడ్లపై ప్రాణాలను అరిచేతుల్లో పెట్టుకొని అందవికలాంగుడు ఒంగోలు జిల్లాలోని కనిగిరి ప్రాంతానికి చెందిన గాయకుడు తమ గేయాలను తమ గానాలను పాటల రూపంలో అద్భుతంగా ప్రదర్శిస్తున్న దృశ్యాలను చూస్తూ వనపర్తి జిల్లా కేంద్రంలో అనేకమంది చదువుకున్న విద్యార్థులు ఆయన పాట ఆయన గానం ఒక్కసారిగా తమ గుండెల్లో గూబులు లేపుతుందని పరవశించిపోయారు. కూటికోసం కోటి విద్యలు అయినప్పటికీ చెవి మూగ, కుంట, గుడ్డి వికలాంగులు ఉన్నత చదువులు చదువుకున్న కూడా ఉద్యోగం రాక తమ తమ నైపుణ్యాలను ప్రదర్శిస్తున్నారు. ఏ ప్రభుత్వం వచ్చినా ఏముంది శూన్యం చివరకు వికలాంగులకు కూడా ఉద్యోగాలు ఇవ్వలేని ప్రభుత్వాలు నేటి సమాజంలో అధికారం కోసం ఆరాటపడుతూ ప్రజలను వికలాంగులను అవమానం చేస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. వికలాంగులతో పాటు అన్ని హంగులు ఉన్న నిరుద్యోగ యువతీ యువకులు కూడా రోడ్లపై భిక్షాటన చేస్తున్నారని ఇలాంటి సంఘటనలు ఎన్నో జరుగుతున్నా కూడా పాలక ప్రభుత్వాలు చీమకుట్టిన కూడా ఒక్క చెమట చుక్క రాకుండా ఏసీలో జీవిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. వికలాంగులు అందులో కళ్ళు కనిపించని అంధ వికలాంగుల పరిస్థితి అగమ్య గోచరం. ప్రభుత్వం ప్రతినెల ఇస్తున్న ఆసరా పెన్షన్లు కూడా రెట్టింపు అదనంగా పెన్షన్ పెంచుతామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్న పెన్షన్ కూడా సకాలంలో అందడం లేదని అంద వికలాంగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీరితోపాటు వృద్ధులు వితంతులు. మూగ చెవిటి వికలాంగులు దారుణమైన పరిస్థితుల్లో జీవిస్తున్నారు. అద్భుతమైన కళారూపం నైపుణ్యం ఉన్నప్పటికీ ఏ ఒక్కడు కూడా ఒక్క రూపాయి సహాయం చేయకుండా తమ పాటను ఓపికతో వింటూ రోడ్లపై ప్రేక్షకుల్లాగా ప్రేక్షక పాత్ర వహిస్తూ వెళ్ళిపోతున్నారని విమర్శలు వస్తున్నాయి. ఇలాంటి దుర్మార్గులు సమాజంలో ఎందుకు జీవిస్తున్నారని ప్రశ్నలు వస్తున్నాయి. కోట్ల రూపాయల డబ్బులు అక్రమ సంపాదన రాజకీయ నాయకులు ప్రభుత్వ ఉద్యోగులు కనీసం 10 రూపాయలు సహాయం చేయకుండా ఇలాంటి అంద వికలాంగులను చిన్నచూపు చూస్తున్నారని వికలాంగుల సంక్షేమ సంఘం రాష్ట్ర స్థాయి జిల్లా స్థాయి నాయకులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకొని మీరు సంపాదిస్తున్న సంపాదనలో 0% శాతం డబ్బు పేద ప్రజలకు పంపిణీ చేయాలని అందులో ముఖ్యంగా అంద వికలాంగులు మూగ ,చెవిటి ,గుడ్డి, వికలాంగులకు సహాయం చేసి తమ వంతుగా మీ కర్తవ్యాన్ని మీ బాధ్యతను నిరూపించుకోవాలని ప్రజల డిమాండ్ చేస్తున్నారు. లేకపోతే మీ వెంట వచ్చేది రెండు మీటర్ల బట్ట మీ జాగా మీ ఇల్లు ఏమవుతుంది ఎక్కడ ఉంటుందో ఒకసారి పరిశీలించుకోవాలని వికలాంగులు డిమాండ్ చేస్తున్నారు. మీ సంపాదన నీ ఆస్తులు మీ వెంట రాకపోయినా కూడా మీకు బుద్ధి రాలేకపోతుందని విమర్శలు కూడా ఉన్నాయి. పది మందికి చెప్పవలసిన బాధ్యత గల రాజకీయ నాయకులు ప్రభుత్వ ఉద్యోగ ఉపాధ్యాయులు, ప్రజా సంఘాలు విద్యార్థి సంఘాలు అనేక సంఘాలు ఎవరికోసం ఎందుకోసం భూమికోసం భుక్తి కోసం జీవిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. ఆస్తుల కోసం అంతస్తుల కోసం తప్ప మీ బతుకులు ఎవరికోసం ఒకసారి సమాధానం చెప్పవలసిన బాధ్యత మీపై ఎంతైనా ఉందని డిమాండ్ చేస్తున్నాం.

# గద్దెల ప్రాంగణంలో పొరపాట్లు జరగకుండా చూడాలి





### రహదారి విస్తరణ పనులను వేగవంతం చేయాలి

### జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్

ఎస్.ఎస్. తాడ్వాయి, డిసెంబర్ 02 (తీన్మార్ న్యూస్): శ్రీ సమ్మక్క సారలమ్మ గద్దెల ప్రాంగణంలో రాతి నిర్మాణాలలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూడాలని, మేడారం రహదారి విస్తరణ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం ఎస్ ఎస్ తాడ్వాయి మండలం మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ దేవాలయం అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. ఎస్పీ సుధీర్ రామ్ నాథ్ కెకాన్, డీఎఫ్ఓ రాహుల్ కిషన్ జాదవ్ లతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆదివాసి సాంప్రదాయాలు ప్రతిబింబించేలా గద్దెల ప్రాంగణంలో ఏర్పాటు చేస్తున్న రాతి నిర్మాణాలలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూడాలని, రహదారి విస్తరణ పనులలో వేగం పెంచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నూతనంగా ఏర్పాటు చేస్తున్న క్యూ లైన్స్ రెలింగ్ పనులను మేడారం స్తూపం వద్ద సర్కిల్ సుందరీకరణ పనులను, పరిశీలించి జాతర సమీపిస్తున్న తరుణంలో ముందస్తు వనదేవతల సందర్శనార్థం మొక్కులు చెల్లించడానికి వచ్చే భక్తులకు ఆటంకం కలగకుండా చూడాలని మాస్టర్ ప్లాన్ ప్రకారం నిర్దేశించిన గడువులోపు అభివృద్ధి పనులను పూర్తిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో, ఆర్ అండ్ బి, విద్యుత్ శాఖ, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు

# విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదగాలి



భీమదేవరపల్లి, డిసెంబర్ 02 (తీన్మార్ న్యూస్): యంయల్సీ సురభి వాణి దేవి. వంగర గ్రామంలో నెలకొల్పిన డా.రంగారావు స్మారక బాలికల గురుకుల పాఠశాల మహోన్నతమైన ఆశయం కొరకు నెలకొల్పిన విద్యా సంస్థ అని "భారతరత్న" మాజీ ప్రధాని స్వర్గీయ పి.వి. నరసింహారావు కూతురు యంయల్సీ వాణిదేవి తెలిపారు. వంగర పర్యటనలో భాగంగా మంగళవారం సాయంత్రం డా.రంగారావు స్మారక ఆశ్రమ పాఠశాలను సందర్శించి పదోతరగతి ఇంటర్ విద్యార్థులతో ముచ్చటించారు. తల్లిదండ్రులకు దూరంగా చిన్ననాటి నుండే ఆశ్రమ విద్యను పొందే అవకాశం లభిస్తుందని ఈ పాఠశాలలో చదివే ప్రతి విద్యార్థి వంగర పేరు నిలపాలని కోరారు. దేశంలో అనేక రంగాలలో మహిళలు స్వశక్తితో రాణిస్తున్నారని దీనకి ముఖ్య కారణంగా మహిళల్లో వుండే ఆత్మవిశ్వాసం అని అభిప్రాయపడ్డారు. ఏ సమస్యనైనా ముందు స్నేహితుల చర్చించడం,

తల్లిదండ్రులతో పాలుపంచుకోవటం, ఉపాధ్యాయుల సహాయంతో అధిగమించేందుకు చొరవ చూపాలని,చిన్న విషయాలకు ఒత్తిడికి గురికాకుండా వుండాలని వుండాలని కోరారు. పి.వి.నరసింహారావు, డా.పి.వి.రంగారావు తమకు ఎన్ని సమస్యలు వున్నా సమయోచిత బుద్దుని ప్రదర్శించి మహోన్నతమైన వ్యక్తులుగా నిలిచారాని వారిని ఆదర్శంగా తీసుకోవాలని కోరారు.

డా.రంగారావు గురుకులు పాఠశాలలలో ఇంటర్ స్థాయిలో అత్యధిక మార్కులు పొందిన బాలికలకు తమ యాజమాన్యంలోని సురభి ఎడ్యుకేషనల్ సంస్థలో ఫైన్ ఆర్ట్స్,ఆర్కిటెక్చర్, ఫార్మసి కళాశాలలో అవకాశం యిస్తామని హామి ఇచ్చారు. పి.వి. కుమారుడు పి.వి.గ్లోబల్ పౌండేషన్ అధ్యక్షులు పి.వి.ప్రభాకర్ రావు మాట్లాడుతూ పేద ప్రజలకు ఉచిత విద్య అందాలనే సంకల్పంతో పి.వి.ముఖ్యమంత్రిగా వున్న సమయంలో సర్వేల్ (నల్గొండ) జిల్లాలో మొట్టమొదటి ఆశ్రమ పాఠశాల ప్రారంభించారని తద్వార అనేక పాఠశాలల ఏర్పాటుకు అవకాశం ఏర్పడం ద్వారా నాటి తరం నుండి నేటికిని అనేక మంది ఈ పాఠశాలలో చదివిన విద్యార్థులు రాష్ట్రంలో కాక దేశంలో

వివిధ హొదాల్లో స్థిరపడ్డారని గుర్తు చేశారు. వంగర ఆశ్రమ పాఠశాలకు తమ సోదరులు రంగా రావు పాఠశాల ఏర్పాటు మొదలుకొ శాశ్వత భవనాల నిర్మాణం కొరకు స్వంత భూమిని అందచేసిన ఘనత డా.పి.వి.రంగారావుదే అనే సంగతి గుర్తు చేశారు. సుదీర్ఘ చరిత్ర గల వంగర ఆశ్రమ పాఠశాల పేరును నిలిపేదిశగా విద్యార్థులు చొరవ చూపాలని, మానసిక ఒత్తిడి జయించడానకి ధ్యానం ముఖ్యమైన మార్గం దాన్ని ఆచరణలోని తీసుకోవాలని కోరారు. ఆశ్రమ పాఠశాలలో సమస్యలపై యాజమాన్యం విన్నపం చేయగా వాటి పరిష్కారం కొరకు చొరచూపేందుకు పి.వి.ప్రభాకర్ రావు హామి యిచ్చారు. తక్షణ అవసరాలకు గాను సైన్స్ లాబ్ కు అవసరమయ్యే టేబుల్స్ అందించానికి పి.వి.ప్రభాకర్ హామియిచ్చారు. ఈ కార్యక్రమంలో పి.వి.మదన్ మోహన్ మాట్లాడుతూ ఎన్ని సమస్యలున్నా ధైర్యం అనే ఆయుధంతో ముందుకు వెళ్లాలి.

అధైర్యం వల్ల ఏ కార్యం సాధించలేమని తెలిపారు. సమస్యలు యితరులతో పంచకోవాలి దాని వల్ల ఒత్తిడికి దూరమవుతామని తెలిపారు.

పి.వి.శరత్ బాబు మాట్లాడుతూ వంగర గ్రామానికి మంచి చరిత్ర వుంది దాన్ని కాపాడే దిశగా విద్యార్థులు క్రుషి చేయాలని కోరారు. ప్రిన్సిపాల్ అప్రజ్ సుల్తానా తల్లిదండ్రులకు దూరంగా వుండి యాజమాన్యంపై నమ్మకంతో పాఠశాలలో చదివే విద్యార్థులు అన్ని రంగాలలో ముందుండే దిశగా ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు భార్గవి మిగితా సిబ్బంది పాల్గొన్నారు.

# అన్యాయం జరిగిన వారికి అండగా బీఆర్ఎస్ లీగల్ సెల్

### మాజీ ఎంపీ, బోయినపల్లి వినోద్ కుమార్ రావు

### తెలంగాణ ఉద్యమంలో న్యాయవాదుల కృషి మరవలేనిది

### ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్




హనుమకొండ, డిసెంబర్ 02 (తీన్మార్ న్యూస్): కేసీఆర్ దీక్షా దివస్ కార్యక్రమంలో భాగంగా 4వ రోజు తెలంగాణ ఉద్యమంలో న్యాయవాదుల పాత్ర అనే అంశంపై మంగళవారం రోజున బాలసముద్రంలోని బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా కార్యాలయంలో న్యాయవాదులతో ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా మాజీ ఎంపీ, బోయినపల్లి వినోద్ కుమార్ రావు మాట్లాడుతూ తెలంగాణకు అన్యాయం జరుగుతోందని, రాజ్యాంగంలోని ఆర్టికల్ 3 ద్వారా తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలని నాడు న్యాయవాదులు ముందుండి కొట్లాడారు. ఉద్యమ సమయంలో న్యాయవాదులు ఉద్యమకారుల తరపున కేసులు వాదించి తెలంగాణ ఉద్యమానికి చేదోడు వాదోడుగా నిలిచారు. ప్రత్యేక తెలంగాణ సాధన ఉద్యమంలో కోర్టు ఆవరణలో సైతం ఉద్యమాలు నడిపిన ఘనత న్యాయవాదులకే దక్కుతుంది. స్వరాష్ట్రం సాధించిన తర్వాత తెలంగాణలో న్యాయవాదుల సంక్షేమానికి నిధులు, నూతన కోర్టుల ఏర్పాటు, కోర్టుల్లో మౌలిక వసతులను కల్పించారు. న్యాయవాద వృత్తి నుంచి వచ్చిన నాలాంటి ఎందరికో కేసీఆర్ రాజకీయ అవకాశాలు సైతం ఇచ్చారు. ఉద్యమ స్ఫూర్తితోనే రానున్న 3 ఏళ్లు బీఆర్ఎస్‌కు అండగా న్యాయవాదులు ఉండాలి. ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, మాజీ శాసనసభ్యులు, బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షులు దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో న్యాయవాదుల పోరాటం గొప్పది, ఉమ్మడి వరంగల్ జిల్లా న్యాయవాదులు నాడు ఉమ్మడి రాష్ట్రంలోని అందరు న్యాయవాదుల్లో ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన పోరాట స్ఫూర్తిని రగిలించారు. తెలంగాణ ఉద్యమకారుల తరపున వాదనలు, తప్పుడు కేసులపై కొట్లాడి తెలంగాణ ఉద్యమాన్ని బతికించారు. గడిచిన రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో బీఆర్ఎస్ శ్రేణులపై నమోదవుతున్న తప్పుడు కేసులను కోర్టుల్లో వాదించి, గెలిచి కాంగ్రెస్ కుట్రలను ఛేదిస్తున్నారు. ప్రజల్లో బీఆర్ఎస్‌కు ఆదరణను పెంచుతున్నారు. లగచర్ల రైతులు, ఫార్మా రైతులు, ట్రిపుల్ ఆర్ బాధితులు, హైడ్రా బాధితులు, తెలంగాణలో కాంగ్రెస్ ఏ వర్గానికి అన్యాయం చేసిన వారు బీఆర్ఎస్ పార్టీనే ఆశ్రయిస్తున్నారు. వారి తరపున బీఆర్ఎస్ పార్టీ, మన లీగల్ సెల్ పోరాడుతోంది. బీఆర్ఎస్ లీగల్ సెల్ పార్టీని, పార్టీని నమ్ముకొని పని చేస్తున్న కార్యకర్తలను తప్పుడు కేసుల నుంచి కాపాడుతోంది. ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి, బీఆర్ఎస్ సోషల్ మీడియా వారియర్స్ వంటి వారిపై తప్పుడు కేసులు నమోదు అయితే కోర్టుల్లో వాదనలు వినిపించి కాపాడుతోంది. న్యాయవాదులు నాడు రాష్ట్ర సాధనలో నేడు రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయాన్ని ఎదిరిస్తున్న బీఆర్ఎస్ పార్టీ, నాయకులకు అండగా ఉంటోంది. కార్యక్రమంలో వరంగల్, హనుమకొండ జిల్లాల బీఆర్ఎస్ లీగల్ సెల్ గౌరవ అధ్యక్షులు సహోదర్ రెడ్డి, జనార్ధన్ గౌడ్, శ్యామ్ సుందర్, లీగల సెల్ బాధ్యులు శివ రాజ్, నాయిని రవి, శ్రీరామ్ కిరణ్, అంజయ్య గౌడ్, వసంత్ యాదవ్, వేణు పటేల్, అరుణ, రంజిత్, తదితరులు పాల్గొన్నారు.

# ఆశ డే సందర్భంగా అవగాహన సమావేశం



మహబూబాబాద్ జిల్లా, డిసెంబర్ 02 (తీన్మార్ న్యూస్): ఆశ డేను పురస్కరించుకుని జిల్లాలోని ఆశ కార్యకర్తల సేవలను గుర్తిస్తూ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఒక ప్రత్యేక జూమ్ సమావేశాన్ని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ బి. రవి రాథోడ్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ రవి రాథోడ్ మాట్లాడుతూ ఆశ వర్కర్లు గ్రామీణ ఆరోగ్య వ్యవస్థకు ముందుబాటుగా వ్యవహరిస్తూ, గ్రామాల్లో ప్రతి కుటుంబానికి ప్రాథమిక ఆరోగ్య సేవలను చేరవేయడంలో అత్యంత ముఖ్యమైన భూమిక పోషిస్తున్నారని తెలిపారు. ప్రతి గర్భిణీ స్త్రీని 12 వారాల లోపు తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. ANC చెక్‌అప్స్, రక్తపరీక్షలు, హీమోగ్లోబిన్ పరీక్షలు, బి.పీ పరీక్షలు, అల్ట్రాసౌండ్ వంటి సేవలను సమయానుకూలంగా అందించేందుకు ఆశలు కుటుంబ స్థాయిలో పర్యవేక్షణ చేయాలని సూచించారు. జబ్బులు, ప్రమాద సూచనలు, అనీమియా, హై రిస్క్ గర్భధారణలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.జిల్లాలో సిజేరియన్ శాతం తగ్గించి సాధారణ ప్రసవాలు పెంచేందుకు గర్భిణి స్త్రీలకు సరైన అవగాహన ఇవ్వాలని తెలిపారు.ప్రసూతి సేవలు అందిస్తున్న PHC\T, CHCల్లో డెలివరీ పాయింట్లు బలోపేతం చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్టు పేర్కొన్నారు. గ్రామాల్లో 100% టీకాకరణ సాధించేందుకు ఆశలు కృషి చేయాలని ఆదేశించారు. పిల్లల్లో పోషకాహార లోపం రాకుండా రియల్ టైమ్ మానిటరింగ్ చేయాలని సూచించారు. గర్భిణులకు IFA టాబ్లెట్లు, కాల్షియం, పోషకాహార మార్గదర్శకాలను తప్పకుండా అందించాలని తెలిపారు.బీపీ, షుగర్, క్యాన్సర్ వంటి అసంక్రమిత వ్యాధుల ల నియంత్రణ కోసం 30 ఏళ్లు పైబడిన ప్రతి వ్యక్తికి స్క్రీనింగ్ కార్యక్రమాలను బలోపేతం చేయాలని సూచించారు. NCD రిజిస్టర్‌ను అప్డేట్ చేయడం, రెగ్యులర్ ఫాలోఅప్ చేయడం, మందుల సమయానుకూల సరఫరాను నిర్ధారించాలన్నారు. జిల్లాలో చలి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో శిశువులు, వృద్ధులు, గర్భిణులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి, వెచ్చని బట్టలు ధరించడం, రాత్రి వేళలు బయట తిరగక పోవడం, వేడి ఆహారం తీసుకోవడం వంటి సూచనలను ప్రజలకు చేరవేయాలని తెలిపారు. ఆరోగ్య కార్యక్రమాలకు సంబంధించిన సమాచారాన్నిరియల్ టైమ్‌లో నమోదు చేయడం, పోర్టల్ డేటా అప్‌డేట్ చేయడం,హౌస్-హోల్డ్ సర్వే ఖచ్చితత్వం పాటించడం వంటి అంశాల్లో ప్రతి ఆశ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. ఈ కార్యక్రమములో ప్రోగ్రాం ఆఫీసర్స్ డా.సారంగం, డా.లక్ష్మీనారయన,డా.నాగేశ్వర్ రావు,డిప్యూటీ డెమో కే.ప్రసాద్,కే.వి.రాజు హెల్త్ ఎద్యుకేటర్, రామకృష్ణ హెచ్.ఇ.ఒ., నిలోహణ డి.పీ.ఒ, సౌమిత్ డి.డి.ఎం, సక్కుబాయి ఇంచార్జి డి.ఫై.హెచ్.యెన్.ఒ, వైద్య అధికారులు, ఆరోగ్య పర్యవేక్షకులు, ANMలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

# టీబీ నియంత్రణ కు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాలి





### హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్

హనుమకొండ జిల్లా, డిసెంబర్ 02 (తీన్మార్ న్యూస్): టీబీ ముక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా స్క్రీనింగ్ పరీక్షలు పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదేశించారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో పట్టణ పరిధిలోని బోడగుట్ట, సోమిడి వడ్డేపల్లి, లష్కర్ సింగారం, పెద్దమ్మ గడ్డ పట్టణ ఆరోగ్య కేంద్రాలు, హసన్ పర్తి, కడిపికొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, సిబ్బందితో ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో 1,98,000 ప్రభావిత గ్రూపులకు చెందిన వారిని పరీక్షించి అవసరమైన పరీక్షలు నిర్వహించవలసి ఉండగా1,30,049 మందికి స్క్రీనింగ్ నిర్వహించడం జరిగింది. స్క్రీనింగ్ తక్కువగా నిర్వహించిన వడ్డేపల్లి, లష్కర్ సింగారం , కడిపికొండ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులను ఇందుకు గల కారణాలను జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ దేశంలో టీబీ నిర్మూలన లక్ష్యంగా ఈ కార్యక్రమం టీబీ ముక్త కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని అన్నారు. జిల్లాలో టీబీ నియంత్రణ కార్యక్రమాలకు యాక్షన్ ప్లాన్ తయారు చేసుకుని దానికి అనుగుణంగా స్క్రీనింగ్, ఎక్స్ రే, నాట్ పరీక్షలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం అందించిన మొబైల్ ఎక్స్ రే మిషన్ ను పరిశీలించి ప్రణాళిక ప్రకారం ఎక్కడైతే ఎక్స్ రే పరీక్షలు తక్కువగా నిర్వహించారో అక్కడి ప్రజలకు అవగాహన కల్పించి ఎక్స్ రే పరీక్షలు నిర్వహించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో స్క్రీనింగ్ బాగానే చేస్తున్నప్పటికీ పట్టణ పరిధిలో మాత్రం చాలా తక్కువగా ఉందని అన్నారు. పట్టణ ప్రాంతాలలో కూడా స్క్రీనింగ్ శిబిరాలు నిర్వహించాలని సూచించారు. వైద్యాధికారులు, సిబ్బంది సమయపాలన పాటించాలని పేర్కొన్నారు. అందుబాటులో ఉన్న సిబ్బంది, వనరులతో టిబి ముక్త భారత్, ఎన్సిడి, మాతా శిశు సంక్షేమంతో పాటు ఇతర అన్ని ఆరోగ్య కార్యక్రమాలు లక్ష్యాలను సాధించాలని, లేనట్లయితే తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అప్పయ్య టీబీ ముక్త భారత్, గర్భిణీ స్త్రీల నమోదు , ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య తక్కువగా ఉన్న ఆరోగ్య కేంద్రాల ఏఎన్ఎంలు, ఆశాలవారీగా సమీక్షించి కారణాలను తెలుసుకొని వాటిని అధిగమించి లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు.100 శాతం ప్రసవాలను ప్రభుత్వ ఆసుపత్రిలోనే జరగడానికి ప్రోత్సహించిన ఆరుగురు ఆశాలను శాలువాలతో సత్కరించారు. ఈ సమావేశంలో అడిషనల్ డిఎంహెచ్వో డాక్టర్ మదన్ మోహన్ రావు, టీబీ నియంత్రణ అధికారి డాక్టర్ హిమబిందు, డిప్యూటీ డి ఎం హెచ్ ఓ డాక్టర్ ప్రదీప్ రెడ్డి, పీవోడిటి డాక్టర్ ప్రభుదాస్, డాక్టర్ జ్ఞానేశ్వర్, డెమో వి అశోక్ రెడ్డి, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# మండలంలో గ్రామ పంచాయతీ ఎన్నికల సాధారణ పరిశీలకుడి పర్యటన



చిట్యాల, డిసెంబర్ 02 (తీన్మార్ న్యూస్): చిట్యాల మండలంలో 2వ సాధారణ గ్రామ పంచాయతీ ఎన్నికల సాధారణ పరిశీలకులు ఫణీంద్ర రెడ్డి పర్యటించారు. జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికలను పారదర్శకంగా, నిష్పాక్షికంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు గ్రామ పంచాయతీ ఎన్నికల సాధారణ పరిశీలకులు ఫణీంద్ర రెడ్డి తెలిపారు. మంగళవారం టేకుమట్ల, చిట్యాల మండలంలోని జడల్ పేట గ్రామ పంచాయతిలలో ఏర్పాట్లను పరిశీలించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. ప్రచార కార్యక్రమాలు, వాహనాలను నిశిత పరిశీలన చేయాలని సూచించారు. నామినేషన్ కేంద్రాలలో సౌకర్యాలు, నామినేషన్‌ల స్వీకరణ విధానాన్ని సమీక్షించారు. ఆర్.ఓ., ఏఆర్ఓలతో నామినేషన్ పత్రాల పరిశీలన, రికార్డుల నిర్వహణ, నమోదు

అభ్యర్థులకు అందించే మార్గదర్శకాలను అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీఓలు, తహసీల్దార్లు పోలింగ్ కేంద్రాల్లో కనీస మౌలిక సౌకర్యాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా ఎఫ్ ఎస్ టి బృందాలతో మాట్లాడి ఇప్పటివరకు చేసిన తనిఖీలు, స్వాధీనం చేసుకున్న వస్తువులు, చేపట్టిన చర్యల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల నియమావళి అమలులో పటిష్ట పర్యవేక్షణ జరగాలని ఆదేశించారు. ఎన్నికలను శాంతియుతంగా, నిబంధనలకు లోబడి నిర్వహించేందుకు అన్ని శాఖలతో సమన్వయం చేసుకోలని అధికారులకు సూచించారు.

# 3వ విడత షెడ్యూల్ డిసెంబర్ 3వ తేదిన ప్రకటన

### జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, డిసెంబర్ 02 (తీన్మార్ న్యూస్): 2వ సాధారణ గ్రామ పంచాయతీ ఎన్నికలకు 3వ విడత షెడ్యూల్ డిసెంబర్ 3వ తేదీన ప్రకటించనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. జిల్లాలో మూడు విడతలుగా 2వ సాధారణ గ్రామ పంచాయతి ఎన్నికలు నిర్వహించనున్నామని ఇప్పటికే మొదటి, రెండో విడత ఎన్నికల నిర్వహణకు నామినేషన్ ప్రక్రియ జరుగుతుందని తెలి పారు. మొదటి విడతకు గత నెల 27న నోటిఫికేషన్ జారీ చేశామని, అందుకు సంబంధించి నామినేషన్లు ఉప సంహరణ 3వ తేదీన సాయంత్రం 3 గంటలతో ముగుస్తుందని, సాయంత్రం 3 గంటల తరువాత పోటీల్లో ఉన్న అభ్యర్థుల తుది జాభితా ప్రకటిస్తారని తెలిపారు. అలాగే 2వ విడత నామినేషన్లు ప్రక్రియ డిసెంబర్ 2వ తేదీతో ముగిసినట్లు తెలిపారు. 3వ విడత నామినేషన్లు ప్రక్రియ డిసెంబర్ 3వ తేదీన ఉదయం 10.30 గంటల నుండి ప్రారంభం అవుతుందని ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు. 3వ తేదీ నుండి 5వ తేదీ వరకు ప్రతి రోజు ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు రిటర్నింగ్ అధికారుల కార్యాలయంలో నామినేషన్లు స్వీకరణ జరుగుతుందని, 6వ తేదీన నామినేషన్లు పరిశీలన 6వ తేది 5 గంటల తరువాత నిర్ధారిత నామినేషన్ల జాబితా ప్రకటన,7వ తేదీన అపీల్స్, 8న పరిష్కారం, 9న మధ్యాహ్నం 3 గంటల వరకు ఉపసంహరణ, అదే రోజున 3 గంటల తరువాత పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితా ప్రకటన ఉంటుందని తెలిపారు. మొదటి దశకు ఈ నెల 11 వ తేదీన, 2వ దశకు 14వ తేదీన, 3 వ దశకు 17వ తేదీ ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం వంటి గంట వరకు పోలింగ్ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. 11, 14, 17 తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల తరువాత పటిష్ట బందోబస్తు మధ్య ఓట్లు లెక్కింపు కార్యక్రమం చేపడతామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా గ్రామ పంచాయతీ 3 దశల ఎన్నికలకు నామినేషన్ల ప్రక్రియ, పోలింగ్, లెక్కింపు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఆయన స్పష్టం చేశారు.

# దివ్యాంగులకు మెపా ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం




హనుమకొండ, డిసెంబర్ 02 (తీన్మార్ న్యూస్): నేడు డిసెంబర్ 3 నాడు అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా మెపా మెపా (ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ తెలంగాణ) ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన దివ్యాంగులకు సన్మానం కార్యక్రమం ఉంటుందని మెపా జిల్లా అధ్యక్షులు పులి రాజేష్ ముదిరాజ్, ఉపాధ్యక్షులు గోనెల విజేందర్ ముదిరాజ్ లు తెలిపారు. ఈ కార్యక్రమం హనుమకొండ పట్టణం కిషన్ పుర లోని వెలాసిటీ జూనియర్ కళాశాలలో సాయంత్రం 4 గం లకు నిర్వహిస్తున్నట్లు , ఈ కార్యక్రమానికి మెపా వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు పులి దేవేందర్ ముదిరాజ్,రాష్ట్ర ఉపాధ్యక్షులు పొన్నం రాజు ముదిరాజ్ లు ముఖ్య అతిథిలుగా హాజరవుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన దివ్యాంగులు తమ పేర్లు నమోదు చేసుకోగలరు అని మరిన్ని వివరాలకు జిల్లా అధ్యక్షులు పులి రాజేష్ ముదిరాజ్ 77026 76961,జిల్లా ఉపాధ్యక్షులు గోనెల విజేందర్ ముదిరాజ్ 83094 95741 లను సంప్రదించగలరు అని తెలిపారు.

## యువత రాజకీయాల్లోకి రావాలి

### సర్పంచ్, వార్డు మెంబర్ కి అచ్చునూరి కిషన్ నామినేషన్ దాఖలు



ములుగు, డిసెంబర్ 02 (తీన్మార్ న్యూస్): మంగళవారం ములుగు మండలంలోని ఇంచర్ల గ్రామ పంచాయితీలో సర్పంచ్, వార్డు మెంబర్ కి నామినేషన్ వేసి ఎన్నికల రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు అందజేసినా అచ్చునూరి కిషన్ ముదిరాజ్, ఈ సందర్భంగా కిషన్ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి, అవినీతి నిర్మూలన యువత తోనే సాధ్యం అని తెలియజేస్తూ, యువత రాజకీయాల్లోకి వచ్చి, ప్రతి ఎన్నికల్లోనూ పోటీ చేసి సమాజ సేవలో భాగస్వామ్యం కావాలని, ఆదర్శవంతమైన గ్రామాలను తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమం యువత, నిరుద్యోగులతోనే సాధ్యం అయిందని, యువత తలుచుకుంటే రాజ్యాలే కులిపోయాయని, యువత తోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని, కావున ప్రజలు యువతను ప్రోత్సాహించి, ఆదర్శవంతమైన గ్రామాలకు మీ వంతు తోడ్పాటు అందించి అభివృద్ధి'లో భాగస్వామ్యం కావాలని తెలియజేశారు.

## కాంగ్రెస్ పార్టీకి భారీ షాక్

### బిఆర్ఎస్ పార్టీలో చేరిన కాంగ్రెస్ పార్టీ నాయకులు



ఏటూరునాగారం, డిసెంబర్ 02 (తీన్మార్ న్యూస్): బీఆర్ఎస్ పార్టీ ఏటూరునాగారం మండల అధ్యక్షులు గడదాసు సునీల్ కుమార్ ఏటూరునాగారం పార్టీ టౌన్ అధ్యక్షులు ఖాజాపాషా ఆధ్వర్యంలో ఈ చేరికలు జరిగాయి. జాడి మల్లయ్య సునారికాని బిక్షపతి తోకల సమ్మయ్య బుల్లెట్టు కాట నరసయ్య గోగు సమ్మయ్య ప్రతాపరెడ్డి సుమారు 10 మంది నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి గులాబీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించిన బీఆర్ఎస్ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు. ఈ సందర్భంగా లక్ష్మణ్ బాబు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి రెండేళ్లయింది. ఎన్నికల ముందు గ్యారెంటీ కార్డులు పంచి బాండ్ పేపర్ రాసిచ్చారు. ఇప్పటికీ రెండు సంవత్సరాలయింది ఒక్క హామీ కూడా అమలు చేయలేదు. 200 పెన్షన్ 2000 చేసింది కేసీఆర్.. ఇంటింటికి మంచినీళ్లు అందించింది కేసీఆర్, పదివేల రైతుబంధు ఇచ్చింది కేసీఆర్. కేసీఆర్ కిట్టు పెట్టి 13వేల రూపాయలు కాన్పుకి ఇచ్చింది కేసీఆర్ పిల్లల చదువుల కోసం వెయ్యి గురుకుల పాఠశాలను ఏర్పాటు చేసింది కేసీఆర్. కేసీఆర్ చెప్పినవి చేసిండు చెప్పనివి కూడా చేసిండు.. రేవంత్ రెడ్డి 2000 పెన్షన్ను 4000 ఇస్తానన్నాడు. ఏమైంది కేసీఆర్. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు ఉన్నారు.

## నేటి నుంచి మూడో విడత మండలాల్లో నామినేషన్లు

### మండలాల్లో నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు పూర్తి

హనుమకొండ, డిసెంబర్ 02 (తీన్మార్ న్యూస్): హనుమకొండ జిల్లాలో మూడో విడతలో నాలుగు మండలాల్లో సర్పంచ్, వార్డు స్థానాలకు బుధవారం నుండి నామినేషన్ల స్వీకరణ చేపట్టనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ స్నేహ శబరీష్ తెలిపారు. జిల్లాలోని ఆత్మకూరు, దామెర, నడికూడ, శాయంపేట మండలాల్లో క్లస్టర్ గ్రామపంచాయతీ కార్యాలయాలలో నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను ఏర్పాటుచేసి ఈ మండలాల పరిధిలోని గ్రామపంచాయతీలకు సర్పంచ్, వార్డు స్థానాలకు అభ్యర్థుల నుండి నామినేషన్లను స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. రెండో విడత ఐదు మండలాల్లో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ మంగళవారంతో ముగియగా బుధవారం నుండి మూడో విడత మండలాలైన ఆత్మకూరు, దామెర, నడికూడ, శాయంపేట మండలాల్లో 68 గ్రామపంచాయతీలు, 634 వార్డు స్థానాలు ఉండగా నామినేషన్ లో స్వీకరణ ప్రక్రియ బుధవారం మొదలవుతుంది. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ఉదయం 10:30 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు సాగుతుంది. మూడో విడత మండలాల్లోని క్లస్టర్ గ్రామపంచాయతీ కార్యాలయాలలో ఏర్పాట్లను సంబంధిత మండలాల ఎంపీడీవోలు, ఇతర అధికారులు పర్యవేక్షించారు.

## అధికారులు పూర్తిగా అప్రమత్తంగా ఉండాలి



వరంగల్ జిల్లా, డిసెంబర్ 02 (తీన్మార్ న్యూస్): గ్రామపంచాయతీ ఎన్నికల మూడో విడత నామినేషన్ల ప్రక్రియ బుధవారం నుండి ప్రారంభం కానున్న నేపథ్యంలో, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులు పూర్తిగా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. మంగళవారం నర్సంపేట ఎంపిడిఓ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతూ, మూడవ విడతలో నర్సంపేట రెవెన్యూ డివిజన్ లోని ఖనాపూర్, చెన్నారవుపేట, నర్సంపేట, నెక్కొండ మండలాల్లోని గ్రామ పంచాయతీ సర్పంచులు, వార్డ్ సభ్యులకు నామినేషన్ స్వీకరణ జరగనున్న దృష్ట్యా నామినేషన్ల స్వీకరణలో రిటర్నింగ్ మరియు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు ఎటువంటి లోపాలు లేకుండా, పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వహించాలనిక లెక్టర్ సూచించారు. ఎన్నికల నిర్వహణలో ప్రతి దశ అత్యంత కీలకమని కలెక్టర్ పేర్కొంటూ, నామినేషన్ కేంద్రాల్లో అవసరమైన ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని, అభ్యర్థులు మరియు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణ, పోలింగ్ వంటి ప్రతి కార్యక్రమం ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం ఖచ్చితంగా అమలు చేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో వరంగల్ జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జడ్పీ సీఈఓ రామ్ రెడ్డి, జిల్లా ప్రత్యేక అధికారి, పశు సంవర్ధక శాఖ అధికారి బాలకృష్ణ, నర్సంపేట ఆర్డీవో ఉమారాణి, ఎంపీడీవోలు, రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు

# ఎడ్యుకేషన్, ఇరిగేషన్ అభివృద్ధితో తెలంగాణ అగ్రగామిగా ఎదుగుదల

### సీఎం రేవంత్ రెడ్డి
### పండిట్ జవహర్ లాల్ నెహ్రూ స్పూర్తితో పని చేస్తున్నాం
### సీతారామ ఎత్తిపోతల పథకం పెండింగ్ పనులు పూర్తి చేస్తాం
### డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీని ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి




భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, డిసెంబర్ 02 (తీన్మార్ న్యూస్): ఎడ్యుకేషన్, ఇరిగేషన్ అభివృద్ధితో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అగ్రగామిగా ఎదుగుతుందని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సీఎం రేవంత్ రెడ్డి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, జిల్లా ఇంచార్జి మంత్రి వర్యులు వాకాటి శ్రీహరి, వ్యవసాయ శాఖ మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వర రావు, రెవెన్యూ హౌసింగ్ శాఖ మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎంపిలు బలరాం నాయక్, రామ సహాయం రఘురాం రెడ్డిలతో కలిసి పర్యటించారు. జిల్లా పర్యటనకు విచ్చేసిన ముఖ్యమంత్రికి కలెక్టర్ జితేష్ వి. పాటిల్, ఎస్పి బి. రోహిత్ రాజు ఘన స్వాగతం పలికారు. కొత్తగూడెంలో నెలకొల్పిన డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించి ప్రజలకు అంకితం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల మద్దతుకు ఏర్పడ్డ ప్రజా ప్రభుత్వం రెండు సంవత్సరాలు గడుస్తున్న నేపథ్యంలో డాక్టర్ మన్మోహన్ సింగ్ పేరు మీద కొత్తగూడెం జిల్లాలో ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేసుకున్నామని అన్నారు. గతంలో కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్ కోసం వందల ఎకరాల భూమి రైతులు ఇస్తే స్థానికులకు కాకుండా ఇతర ప్రాంతాల వారికి ఉపాధి లభించడంతో మొట్టమొదటిసారి తెలంగాణ ఉద్యమానికి పునాదులు పడింది పాల్వంచ ప్రాంతంలోనని, తెలంగాణ ఉద్యమానికి స్పూర్తి ఈ ప్రాంతం అందించిందని అన్నారు. 60 సంవత్సరాల తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేర్చిన ప్రధాని మన్మోహన్ సింగ్ పేరు ఈ విశ్వ విద్యాలయానికి పెట్టుకోవడం సంతోషంగా ఉందని అన్నారు. భారతదేశ మొదటి ప్రధానమంత్రి పండిట్ జవహర్ లాల్ నెహ్రూ స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశం అభివృద్ధి చెందడానికి ఎడ్యుకేషన్, ఇరిగేషన్ పాలసీ అమలు చేశారని, ప్రస్తుతం దేశంలో ఉన్న గొప్ప విశ్వ విద్యాలయాలు, ఇరిగేషన్ ప్రాజెక్టులు ఆనాటి ప్రధానమంత్రినెహ్రూ ప్రారంభించినవి అని అన్నారు. బాక్రానంగల్ నుంచి నాగార్జునసాగర్ వరకు, శ్రీశైలం నుంచి శ్రీరామ్ సాగర్ వరకు నీటి పారుదల ప్రాజెక్టులను జవహర్ లాల్ నెహ్రూ నిర్మించారని తెలిపారు. దేశం మొదటి ప్రధాని స్ఫూర్తితో ఎడ్యుకేషన్, ఇరిగేషన్ తెలంగాణను దేశ పటం మీద మొదటి స్థానంలో నిలుపుతుందని తమ ప్రభుత్వం బలంగా విశ్వసిస్తుందని అన్నారు. ఖమ్మం జిల్లాలో ఉన్న అపారమైన ఖనిజ సంపదను గుర్తించి వాటి మీద పరిశోధనలు జరగాలని ఎర్త్ యూనివర్సిటీ కొత్తగూడెంలో పెట్టాలని ప్రభుత్వం నిర్ణయించిందని అన్నారు. కొత్తగూడెంకు వైద్య కళాశాల, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి యంగ్ ఇండియా సమీకృత గురుకుల నిర్మాణం వంటి గొప్ప విద్యాలయాలను ఖమ్మం జిల్లాకు అందించాలని లక్ష్యంతో ముందుకు పోతున్నామని అన్నారు. గోదావరి, కృష్ణ జలాలు ఖమ్మం జిల్లాకు వస్తాయని, ఇక్కడ ప్రాజెక్టులను పూర్తి చేసి రైతుల పొలాలకు నీరు ఇవ్వాలని ప్రభుత్వం సంకల్పించిందని, సీతారామ ప్రాజెక్టు పూర్తి చేయడంతో పాటు పెండింగ్ ఉన్న మిగిలిన అన్ని ప్రాజెక్టులు పూర్తి చేస్తామని సీఎం తెలిపారు. రాష్ట్ర పాలనకు ఆయువు పట్టు ఖమ్మం జిల్లాలో ఉందని, ఇక్కడ మంత్రులు అనుకుంటే సాధించలేనిది ఏమీ ఉండదని అన్నారు. ప్రజలకు రేషన్ కార్డు, సన్న బియ్యం, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ చీరలు ఇటువంటి అనేక కార్యక్రమాలను ఖమ్మం జిల్లా నుంచి ప్రారంభించామని అన్నారు. భద్రాద్రి శ్రీ రామ చంద్రుని సాక్షిగా ఖమ్మం జిల్లాను అభివృద్ధి చేసే బాధ్యతను తీసుకుంటున్నట్లు సీఎం తెలిపారు. ప్రజలు వేసిన ఓటు ఫలితంగా రెండు సంవత్సరాల కాలంలో మంచి పాలన అందిస్తున్నామని తెలిపారు. గ్రామ సర్పంచ్ ఎన్నికలలో మంచి అభ్యర్థులను, పని చేయగలిగే వారిని ఎన్నుకోవాలని, డబ్బులకు మద్యం బాటిళ్లకు, ప్రలోభాలకు లొంగవద్దని సీఎం రేవంత్ రెడ్డి పిలుపు నిచ్చారు. డిసెంబర్ 8, 9 తేదీలలో జరిగే తెలంగాణ విజయోత్సవాలు, తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ కార్యక్రమానికి ప్రధానమంత్రి రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గే, ప్రధాన మంత్రులను ఆహ్వానించేందుకు ఢిల్లీ వెళుతున్నానని, మరోసారి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు వస్తానని, ఇక్కడ ప్రజలు అందించే ప్రేమ పూర్వకమైన స్వాగతం తనకు చాలా ఉత్సాహాన్ని ఇస్తుందని సీఎం తెలిపారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ప్రభుత్వం ఇక్కడ ఏర్పాటు చేస్తుందని, భూమి పరిసరాలు, భూమి లోపల ఉన్న ఖనిజాల గురించి విశ్వవిద్యాలయంలో పరిశోధనలు జరుగుతాయని, ప్రపంచానికి జ్ఞానాన్ని అందించే విద్యాలయం లకు నేడు తొలి అడుగు వేసామని అన్నారు. దేశానికే దిక్సూచిగా తెలంగాణ రాష్ట్రం నిలుస్తుందని, ఎర్త్ సైన్స్ యూనివర్సిటీకి అవసరమైన వసతులు వీలైనంత త్వరగా పూర్తి చేస్తామని అన్నారు.

వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ దేశానికే తలమానికంగా ఎర్త్ సైన్స్ విశ్వవిద్యాలయం డాక్టర్ మన్మోహన్ సింగ్ పేరు మీద కొత్తగూడెం జిల్లాలో ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. దేశంలో వినూత్న విశ్వవిద్యాలయాన్ని ఉమ్మడి ఖమ్మం జిల్లాకు కేటాయించి నందుకు ప్రజల తరఫున సీఎంకు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. కొత్తగూడెం జిల్లాకు గోదావరి జలాలు, విద్యుత్ కేంద్రం రావాలని అన్నారు. సీతారామ ఎత్తిపోతల పథకం పూర్తి చేసేందుకు అదనంగా నిధులు మంజూరు చేశారని తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెంకు విమానాశ్రయం ఏర్పాటు చేయాలని అన్నారు. రెవెన్యూ హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేసిన ఆనాటి ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ పేరిట ఎర్త్ సైన్స్ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేసినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన రెండు సంవత్సరాల కాలంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీ అమలు చేస్తున్నామని, ప్రజలు పనిచేస్తున్న ప్రజా ప్రభుత్వానికి తమ ఆశీర్వాదాలు అందించాలని అన్నారు. కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబ శివరావు మాట్లాడుతూ కొత్తగూడెం నియోజక వర్గంపై ప్రత్యేకమైన ప్రేమతో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న, ఎర్త్ యూనివర్సిటీని ఈ ప్రాంతానికి ఇచ్చినందుకు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. సీతారామ ఎత్తిపోతల పథకం ప్రాజెక్టు పనులు జరుగుతున్నాయని, 800 మెగా వాట్ల విద్యుత్ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు ఇటీవల క్యాబినెట్ ఆమోదం లభించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లు విద్యా చందన, వేణుగోపాల్, ఎమ్మెల్యేలు రాందాస్ నాయక్, మట్టా రాగమయి, కోరం కనకయ్య, పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావు, కార్పొరేషన్ చైర్మన్లు, ప్రజా ప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు, ఆర్డీఓ మధు, ప్రిన్సిపాల్ జగన్మోహన్ రాజు, ప్రొఫెసర్లు, విద్యార్థులు, మహిళా సంఘాల సభ్యులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ శ్రేయస్సు, స్థితిస్థాపక కార్యక్రమం అమలుకి జిల్లా ఎంపిక

### గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి పెంపు
### మహిళలు, యువత, రైతులకు లబ్ది
### జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



జనగామ జిల్లా, డిసెంబర్ 02 (తీన్మార్ న్యూస్): వలసలను నిరోధించడానికి... గ్రామీణ ప్రాంతాలలో ఉద్యోగ అవకాశాలను సృష్టించడం లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన గ్రామీణ శ్రేయస్సు స్థితిస్థాపకత కార్యక్రమానికి జనగాం జిల్లా ఎంపిక అయ్యిందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మంగళవారం తెలిపారు. గ్రామీణ జీవనోపాధిని మెరుగుపరచి.. మహిళలను, యువత ను, రైతులని మరింత సంపన్నంగా స్థితిస్థాపకంగా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం 2025 బడ్జెట్ లో ప్రకటించిన ఈ కార్యక్రమానికి జిల్లా ఎంపిక అయిన నేపథ్యంలో మంగళ వారం రూరల్ డెవలప్మెంట్ జాయింట్ సెక్రటరీ కి కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లా లో గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న స్థితి గతులను వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా గ్రామీణ శ్రామిక శక్తికి కొత్త నైపుణ్యాలను అందించడం,అలాగే ఆయా ప్రాంతాల్లో పెట్టుబడులను ప్రోత్సహించడం, వ్యవసాయం, ఇతర గ్రామీణ సంస్థలను మెరుగుపరచడానికి కొత్త సాంకేతిక పరిజ్ఞానాలను స్వీకరించడం తదితర అంశాలకు సంబందించిన కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా జిల్లాలో ముమ్మందు కేంద్ర ప్రభుత్వం మార్గ దర్శకాలకు అనుగుణంగా వివిధ కార్యక్రమాలను చేపట్టనున్నట్లు తెలిపారు. పనుల కోసం వేరే ప్రాంతాలకు వలసలు అవసరం లేకుండా గ్రామాల్లో తగినంత అవకాశాలను సృష్టించే ఈ కార్యక్రమంలో గ్రామీణ మహిళలు రైతులు, యువత, భూమిలేని కుటుంబాలు లబ్ది పొందనున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు.

## నామినేషన్ల కేంద్రాలను పరిశీలించిన జిల్లా ఎన్నికల పరిశీలకులు శివకుమార్ నాయుడు



హనుమకొండ జిల్లా, డిసెంబర్ 02 (తీన్మార్ న్యూస్): గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను హనుమకొండ జిల్లా ఎన్నికల పరిశీలకులు శివకుమార్ నాయుడు మంగళవారం పరిశీలించారు. ధర్మసాగర్ మండలం ఎల్కుర్తి, పెద్ద పెండ్యాల క్లస్టర్ల పరిధిలో నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను సందర్శించి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను జిల్లా ఎన్నికల పరిశీలకులు శివ కుమార్ నాయుడు పరిశీలించారు. రెండో విడత నామినేషన్ల స్వీకరణలో రెండు రోజులపాటు, ఈరోజు ఎన్ని నామినేషన్లు వచ్చాయని రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులను జిల్లా ఎన్నికల పరిశీలకులు అడిగి తెలుసుకున్నారు. నామినేషన్ల స్వీకరణ కేంద్రాలలో హెల్ప్ డెస్క్, తదితర ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా నామినేషన్ల స్వీకరణ ప్రక్రియకు సంబంధించి ఎన్నికల అధికారులను వివరాలు అడిగి తెలుసుకుని, సూచనలు చేశారు. ఈ పరిశీలనలో ధర్మసాగర్ ఎంపీడీవో అనిల్ కుమార్, ఇతర అధికారులు ఉన్నారు.

# తట్టుపల్లిలో కాంగ్రెస్‌కు భారీ షాక్

**100 మంది రాజీనామాలు**

**పార్టీ లోకల్ నేతల అహంకారం**

**ఎమ్మెల్యే రామచంద్రు నాయక్ నిర్లక్ష్యం**

**రెడ్యానాయక్ సమక్షంలో బి.ఆర్.ఎస్ లో చేరిక**



డోర్నకల్, డిసెంబర్ 02, (తీన్మార్ న్యూస్): కాంగ్రెస్ పార్టీని కష్ట కాలంలో నిలబెట్టినవాళ్లను కాదనిస్వార్థం కోసం నిన్న, మొన్న కాంగ్రెస్‌లో చేరినవాళ్లకే టికెట్లు ఇస్తున్నందుకు నిరసనగా తట్టుపల్లి కాంగ్రెస్ పార్టీ నుండి రాజీనామాలు జరుగుతున్నాయి. డోర్నకల్ నియోజకవర్గం కురవి మండలం తట్టుపల్లి గ్రామ కాంగ్రెస్ నుండి ఏకంగా 100 మంది పార్టీ సీనియర్ నాయకులు, క్రియశీల సభ్యులు తమ పార్టీ సభ్యత్వాలకు రాజీనామా చేసిన ఘటన కాంగ్రెస్ పార్టీ అంతర్గత బలహీనతను బట్టబయలు చేసింది. సీనియర్ కేడర్, గ్రామ స్థాయిలో గత 11 సంవత్సరాల నుండి పోరాడిన నాయకులు పక్కనపెట్టి, కాంగ్రెస్‌కు ఓ రోజు కూడా పని చేయని, పార్టీ సభ్యత్వం కూడా లేని వారికి సర్పంచ్ టికెట్ ఇవ్వడంతో ఆగ్రహంకు లోనై పార్టీ రాజీనామాలు చేసి బి. ఆర్. ఎస్ రాష్ట్ర నాయకులు, మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యే డి. ఎస్. రెడ్యానాయక్ సమక్షంలో బి. ఆర్. ఎస్ పార్టీలో చేరారు.

**డోర్నకల్ ఎమ్మెల్యే రామచంద్రు నాయక్ అసమర్థ రాజకీయాలు!**

గ్రామంలో కాంగ్రెస్ బలహీన పడ టానికి కారణం ఒకటే ఎమ్మెల్యే రామచంద్రు నాయక్ నా మాటే చట్టం నా అనుచరులకే టిక్కెట్, కాంగ్రెస్ పార్టీలోని నెహ్రూ నాయక్ వర్గం వారికి టికెట్ ఇచ్చేది లేదని, ఆయన అడుగులకు మడుగులు వత్తె వారికే సర్పంచ్ పదవులు ఇస్తున్నారని, ఇదే పద్దతి గ్రామ నాయకులు కొనసాగించడం వల్ల తాము విసిగిపోయామని రాజీనామా చేసిన వారు ఆవేదన వ్యక్తం చేశారు.

**కాంగ్రెస్ లో గ్రూపుల రాజకీయాలే దెబ్బ**

తట్టుపల్లిలో కాంగ్రెస్ ఒకే పార్టీ కాదు...గ్రూప్ ఏ, గ్రూప్ బి, అమ్ముడైన గ్రూప్, రిక్రూట్ రాజకీయాలు, ఇలా నాలుగు ముక్కలైపోయి అబాసు పాలు అవుతుంది. ఇంత చిన్న గ్రామంలోనే పార్టీ ఇంతగా బ్రష్టుపడితే, ఎన్నికల తర్వాత కాంగ్రెస్ పేరు చెప్పేవాళ్లే ఉండరని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

**పార్టీని రక్తం, చెమట, కష్టంతో నిలబెట్టిన వారికి అవమానం**

కాంగ్రెస్ జెండా మోసినవారిని పక్కనబెట్టి, "డబ్బు, లాభం, కమిషన్" రాజకీయాలు నడిపితే ఇది తప్ప ఇంకేం వస్తుంది? అందుకే ఇది మా నిర్ణయం మా తిరుగుబాటని రాజీనామా చేసిన రాజీనామాలు చేసిన వారు గళం విప్పి ఒక హెచ్చరికలు చేశారు. మా కృషితో పలు ఎన్నికల్లో పనిచేస్తే తక్కువ చూపు చూసిన మిమ్మల్ని ఓడించి తీరుతాం...అన్న సందేశం ఇప్పుడు గ్రామ రాజకీయాల్లో మారుమోగుతోంది.

**స్థానిక ఎన్నికల్లో పరిస్థితి దారుణం?**

కాంగ్రెస్ పార్టీ జిల్లా, రాష్ట్ర నాయకత్వం ఇక్కడ అసమ్మతి గ్రహించకుండా తప్పు చేసింది. ఎప్పుడు ఎమ్మెల్యే భజన చేసే జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులకు రేపటి వ్యతిరేక ఓట్లే గట్టిగా శిక్షిస్తాయని, కాంగ్రెస్ నాయకులు గ్రహించాలి.

# డిసెంబర్ 9 డెడ్‌లైన్..



హైదరాబాద్, డిసెంబర్ 02 (తీన్మార్ న్యూస్): డిసెంబర్ 9 నాడు ఉద్యమకారులకు భూములు ఇస్తున్నట్లు ప్రకటించకపోతే జాగృతి తరఫున భూపోరాటాలు ప్రారంభం చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వానికి తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత వార్నింగ్ ఇచ్చారు. మంగళవారం బంజారాహిల్స్‌లోని జాగృతి కార్యాలయంలో తెలంగాణ అమరవీరుల స్మృతిలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జాగృతి నాయకులు, కార్యకర్తలతో కలిసి కవిత రక్తదానం చేశారు. అనంతరం కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ అమరులను స్మరించుకుంటూ తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో మెగా బ్లడ్ డొనేషన్ క్యాంప్ నిర్వహించామని తెలిపారు. రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులను కార్యక్రమంలో తలుచుకోవటం జరిగిందన్నారు. నాటి కేసీఆర్ దీక్ష, అమరుల బలిదానాలు, విద్యార్థుల త్యాగాలు, తెలంగాణ ప్రజలు చేసిన ఉద్యమం ద్వారా తెలంగాణ తెచ్చుకున్నామని వివరించారు. కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పటికీ ఉద్యమకారులను అప్పటి ఎమ్మెల్యేలు, మంత్రులు పట్టించుకోలేదని ఆరోపించారు. రాష్ట్ర సాధన కోసం త్యాగాలు చేసిన వారిని గౌరవించకపోవడం అందరినీ బాధించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యమంలో మనమే 12 వందల మంది అమరులయ్యారని చెప్పినట్లు గుర్తుకు చేశారు. కానీ కేవలం 540 కుటుంబాలకు మాత్రమే సహాయం చేశామని వెల్లడించారు. వారికి కూడా కనీస గౌరవం ఇవ్వలేదు. రాష్ట్రావతరణ రోజున పిలిచి శాలువ కూడా కప్పలేదని ఆవేదన చెందారు. వారికి గుర్తింపు కార్డులు, గౌరవం ఇవ్వలేదన్న బాధ ప్రజల్లో ఉన్నట్లు జనంబాటలో తిరుగుతున్నప్పుడు తాను గమనించినట్లు పేర్కొన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో జరిగిన తప్పిదాలను మేము సరిచేస్తామని చెప్పి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. ఉద్యమకారులకు గుర్తింపు కార్డులు, పెన్షన్లు, 250 గజాల స్థలం ఇస్తామని హామీ ఇచ్చిందని గుర్తుకు చేశారు. ముఖ్యమంత్రి ఉద్యమకారులకు చెప్పింది చెప్పినట్లుగా డిసెంబర్ 9 నాడు అనౌన్స్ చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యమకారులకు పెన్షన్లు, గుర్తింపు కార్డులు ఇచ్చే ప్రక్రియ ప్రారంభించాలని వార్నింగ్ ఇచ్చారు. అప్లికేషన్స్ పెట్టుకోవాలంటూ రెండేళ్లుగా మీరు కాలయాపన చేస్తున్నారని, కనీసం రాష్ట్రావతరణ రోజున ఉద్యమకారులు, వారి కుటుంబాలను గౌరవించిన పాపాన పోలేదని మండిపడ్డారు. మేము డిమాండ్ చేస్తే గానీ అమరుల స్థూపం వద్దకు వెళ్లలేదు జై తెలంగాణ అనలేదు అని విమర్శించారు. మీరు నేడు తెలంగాణకు ముఖ్యమంత్రి అయ్యారంటే అమరుల పోరాటమేనని గుర్తించాలని హితువు పలికారు. వారికి మీరు చేసిన వాగ్దానాలన్నీ కూడా నిలబెట్టుకోవాలన్నారు. డిసెంబర్ 9 నాడు మీరు ఉద్యమకారులకు భూములు ఇస్తున్నట్లు ప్రకటించకపోతే జాగృతి తరఫున భూపోరాటాలు ప్రారంభం చేస్తామని హెచ్చరించారు. ఎక్కడ ప్రభుత్వ భూమి ఉంటే అక్కడకు ఉద్యమకారులను తీసుకెళ్లి వారికి ఆ భూమిని పంచుతామని స్పష్టం చేశారు. మా రక్తం, చెమట ధారపోసి తెలంగాణ తెచ్చాం అలాంటి వారందరికీ కూడా భూములు దక్కాల్సిన అవసరముందని తెలిపారు. ఉద్యమకారుల కోసం చేసే భూ పోరాటంలో భూమి ఎక్కడ ఉంటే అక్కడ జాగృతి జెండాలు కూడా పాతుతామని స్పష్టం చేశారు. డిసెంబర్ 9 నాడు సీఎం రేవంత్ రెడ్డి ఇందుకు సంబంధించిన ప్రకటన చేయాలని, లేదంటే జాగృతి తరఫున భూ పోరాటాలు ప్రారంభమవుతాయని కవిత హెచ్చరించారు.

# కోనసీమ కొబ్బరి తోటలకు 'దిష్టి'

**పవన్ వ్యాఖ్యలపై భగ్గుమన్న తెలంగాణ**

**మండిపడుతున్న కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు**

**తక్షణమే క్షమాపణ చెప్పకపోతే తీవ్ర పరిణామాలు**

**నేతల మాస్ వార్నింగ్.. జనసేన క్లారిటీ**



తెలంగాణ బ్యూరో, డిసెంబర్ 02 (తీన్మార్ న్యూస్): కొబ్బరి తోటలకు దిష్టి వ్యవహారం మరింత రాజుకుంటోంది. కోనసీమ కొబ్బరి తోటలకు తెలంగాణ నాయకుల దిష్టి తగిలిందన్న ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలు తీవ్ర దుమారాన్ని రేపాయి. కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు పవన్ వ్యాఖ్యలపై తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు. తక్షణమే పవన్ తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పకపోతే పర్యవసానాలు దారుణంగా ఉంటాయని తెలంగాణ నేతలు మాస్ వార్నింగ్ ఇస్తున్నారు. అయితే రెండు రాష్ట్రాల రాజకీయాల్లో వివాదాస్పదమైన తన వ్యాఖ్యలపై పవన్ కళ్యాణ్ వివరణ ఇచ్చారు. తన వ్యాఖ్యలను వక్రీకరించవద్దని, ఆరోజు నేను ఎలాంటి చెడు ఉద్దేశంతో అనలేదని అన్నారు. ఈమేరకు జనసేన పార్టీ ప్రధాన కార్యాలయం నుంచి లేఖ విడుదల చేసారు. రాజోలు నియోజకవర్గంలో పర్యటించినపుడు రైతులతో ముచ్చటిస్తూ చేసిన వ్యాఖ్యలను వక్రీకరించారని లేఖలో పేర్కొన్నారు. ఇరు రాష్ట్రాల మధ్య ఉన్న ఫ్రెండ్లీ వాతావరణం చెడగొట్టేలా చేయవద్దని విజ్ఞప్తి చేసారు. అయితే ఈ లేఖ పవన్ కళ్యాణ్ నుంచి కాకుండా ఆ పార్టీ కార్యాలయం నుంచి విడుదల అయింది. అయితే పవన్ కళ్యాణ్ కు క్షమాపణ చెప్పే ఉద్దేశం లేకనే ఇలా పార్టీ తరపున లేఖ విడుదల చేయించారని రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది.

# పవన్.. క్షమాపణ చెప్పకపోతే "ఒక్క సినిమా ఆడనివ్వం"

**మంత్రి కోమటిరెడ్డి వార్నింగ్**

**దిష్టి కామెంట్స్‌పై భగ్గుమన్న కోమటిరెడ్డి**

హైదరాబాద్, డిసెంబర్ 02 (తీన్మార్ న్యూస్): కోనసీమకు తెలంగాణ నాయకుల దిష్టి తగిలినట్టు ఉంది అంటూ ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి స్పందించారు. తెలంగాణ వచ్చి పదేళ్లకు పైగా అవుతోందని అన్నారు. ఇలాంటి సమయంలో తెలంగాణను అవమానించేలా మాట్లాడవద్దన్నారు. పవన్ కళ్యాణ్ భేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. పవన్ క్షమాపణ చెప్పకపోతే ఒక్క సినిమా కూడా ఆడనివ్వము అంటూ హెచ్చరించారు. చిరంజీవి సూపర్ మ్యాన్ అని ఆయన ఎప్పుడూ వివాదాలకు దూరంగా ఉంటారని అన్నారు. కానీ పవన్ కళ్యాణ్ కొత్తగా రాజకీయాల్లోకి వచ్చి డిప్యూటీ సీఎం అవ్వగానే తెలిసి తెలియక మాట్లాడారో కావాలనే మాట్లాడారో కానీ క్షమాపణ చెప్పాలన్నారు. అలా చేస్తేనే కనీసం ఆయన సినిమా ఒకటి రెండు రోజులు అయినా థియేటర్లో ఆడతాయన్నారు. లేదంటే ఆయన సినిమాలు తెలంగాణలో విడుదల అవ్వవని సినిమాటో గ్రఫీ శాఖ మంత్రిగా ఈ విషయం చెబుతున్నానని చెప్పారు. ఇదిలా ఉంటే పవన్ ఇటీవల కోణసీమలో జరిగిన ఓ కార్యక్రమంలో తెలంగాణ నాయకులు కోణసీమ పచ్చదనంతో ఉంటుందని అనేవారని ఇప్పుడు కొబ్బరిచెట్లకు మొండాలు కూడా లేవన్నారు. అంత దిష్టి కోనసీమకు తగిలిందన్నారు. నరుడి దిష్టికి నల్లరాయి అయినా బద్దలైపోతుందని వ్యాఖ్యానించారు. రాష్ట్రం విడిపోవడానికి కూడా కారణం గోదావరి జిల్లాల పచ్చదనమే అని వ్యాఖ్యానించారు.



# దేశానికి విజ్ఞాన దిక్సూచిగా ఎర్త్ సైన్సెస్




భద్రాద్రి కొత్తగూడెం, డిసెంబర్ 02 (తీన్మార్ న్యూస్): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ మంగళవారం భూమి పూజ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి ఇతర మంత్రులు పాల్గొన్నారు. అనంతరం ప్రజా పాలన, ప్రజా విజయోత్సవాల బహిరంగ సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీని ప్రపంచ స్థాయికి తీసుకు వెళ్లడం ప్రజా ప్రభుత్వ లక్ష్యం అని అన్నారు. దివంగత మాజీ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ పేరు పెట్టిన ఈ యూనివర్సిటీని ఆయన ప్రతిష్టకు తగిన విధంగా అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేస్తామని తెలిపారు. దేశంలోనే అత్యున్నత ప్రమాణాలతో నిర్మించనున్న ఈ యూనివర్సిటీ భూమి పూజ కార్యక్రమం తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణమని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు. ఇప్పటి వరకు దేశంలో ఎక్కడా పూర్తిస్థాయి ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ లేకపోవడం వల్ల, ఈ సంస్థ భూగర్భ పొరలు, ఖనిజాలు, భూమికి సంబంధించిన శాస్త్ర పరికల్పనలపై సమగ్ర పరిశోధనలకు కొత్త దిశ చూపనుందని చెప్పారు. అతి తక్కువ సమయంలో భవనాలు, ఆధునిక సౌకర్యాలు, పరిశోధన వసతులు పూర్తి చేసి యూనివర్సిటీని ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ యూనివర్సిటీ దేశానికి విజ్ఞాన దిక్సూచిగా, తెలంగాణ ప్రతిభను ప్రపంచానికి పరిచయం చేసే కేంద్రంగా నిలుస్తుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు.

# దేశానికి అన్నపూర్ణగా తెలంగాణ

తెలంగాణ బ్యూరో, డిసెంబర్ 02 (తీన్మార్ న్యూస్): సుస్థిర పాలన, రైతులకు లాభం చేకూర్చే విధానాలు, విస్తరణ ఫలితాలతో రాష్ట్రంలో వ్యవసాయం రైజింగ్ అవుతోంది. గడిచిన రెండేండ్లలో తెలంగాణ దేశమందరి దృష్టిని ఆకర్షించేలా పంటల సాగులో కొత్త రికార్డులు నెలకొల్పింది. వరి సాగు విస్తీర్ణం, దిగుబడిలో పంజాబ్‌ను దాటేసింది. రాష్ట్ర స్థూల ఉత్పత్తి విలువలో వ్యవసాయం వాటా 6.7 శాతం పెరిగింది. ప్రస్తుత ధరల ప్రకారం వ్యవసాయ రంగం వాటా గత ఏడాది రూ.1,00,004 కోట్లు నమోదవగా 2024-25 అంచనాల ప్రకారం రూ. 1,06,708కు చేరిందని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో రాష్ట్రంలో పంటల సాగు విస్తీర్ణం పెరిగింది. 2023-24 సీజన్ లో 209.62 లక్షల ఎకరాల్లో అన్ని పంటలు సాగు చేయగా 296.17 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చింది. 2024-25 సీజన్ లో సాగు విస్తీర్ణం ఏకంగా 220.77 లక్షలకు పెరిగింది. దిగుబడి 320.62 లక్షల మెట్రిక్ టన్నులకు చేరింది. తెలంగాణలో ప్రధాన పంటైన వరి 2023-24లో 118.11 లక్షల ఎకరాల్లో సాగు చేశారు. 2024-25లో అది 127.03 లక్షల ఎకరాలకు పెరిగింది. ధాన్యం దిగుబడి 260.88 లక్షల మెట్రిక్ టన్నుల నుంచి ఈ ఏడాది వానాకాలం, యాసంగిలో కలిపి 284.16 లక్షల మెట్రిక్ టన్నులకు పెరిగింది. ధాన్యం ఉత్పత్తిలో తెలంగాణ దేశంలో అగ్రగామిగా నిలిచింది. పత్తి సాగు విస్తీర్ణం ఇంచుమించుగా రెండేండ్లు ఒకే తీరుగా ఉంది. 49 నిరుటితో పోలిస్తే ఈ ఏడాది పత్తి కప్పాల ఉత్పత్తి 3.89 లక్షల టన్నులు పెరిగింది. 26.35 లక్షల టన్నుల నుంచి 30.24 లక్షల టన్నులకు చేరింది. తొలి రెండేండ్లలోనే ప్రజా ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యమిచ్చింది. తెలంగాణ రైతులను దేశానికే ఆదర్శంగా నిలబెట్టాలనే సంకల్పంతో రూ.లక్ష కోట్లకు పైగా ఖర్చు చేసింది. రూ.54280 కోట్లతో వివిధ పథకాలను అమలు చేసింది. దేశంలోనే వరి సాగు విస్తీర్ణంలో తెలంగాణ నెంబర్ వన్ స్థానాన్ని నిలబెట్టుకుంది. 66.77 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయగా గతంలో ఎన్నడూ లేని విధంగా 153 లక్షల టన్నుల దిగుబడి వచ్చింది.

# గ్లోబల్ సమ్మిట్ అతిథులకు 'తెలంగాణ' ఘన స్వాగతం

**ప్రపంచ వేదికపై మన రుచులు, కళలు**

**అతిథులకు పోచంపల్లి పట్టు, సకినాల ఘుమఘుమలు**

**డిసెంబర్ 8, 9న తెలంగాణ రైజింగ్ సదస్సు**




హైదరాబాద్, డిసెంబర్ 02 (తీన్మార్ న్యూస్): గ్లోబల్ సమ్మిట్ హాజరయ్యే ప్రముఖులకు, అతిథుల కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక బాస్కెట్‌లను అందజేయనుంది. డిసెంబర్ 8, 9 తేదీల్లో భారత్ ఫ్యూచర్ సిటీలో జరగే తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్‌కు ప్రపంచం నలుమూలల నుంచి కార్పొరేట్ ప్రతినిధులు, పరిశ్రమల ప్రముఖులు, పెట్టుబడిదారులు హాజరుకానున్నారు. వీరి కోసం తెలంగాణ రాష్ట్రం ప్రత్యేకంగా స్వాగతం పలకనుంది. హైదరాబాద్‌కు చేరుకున్న వెంటనే వారికి ఎప్పటికి గుర్తిండిపోయేలా సాంప్రదాయ కిట్లు, రుచికరమైన వంటకాలతో కూడిన ఫుడ్ బాస్కెట్లు అందజేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

**కిట్‌లో ఏముంటాయంటే**

సదస్సుకు హాజరయ్యే అతిథులకు అందించే స్పెషల్ బాస్కెట్ లో పోచంపల్లి ఇక్కత్, 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్' లోగోతో కూడిన సావనీర్ కిట్లను అందించనున్నారు. పోచంపల్లి శాలువా, చేర్యాల మాస్క్(పెయింటిగ్స్), హైదరాబాద్ అత్తర్, హైదరాబాద్ ముత్యాలతో చేసిన ఆభరణాలు ఇందులో ఉంటాయి. అదేవిధంగా ప్రత్యేక డిజైన్‌తో సిద్ధం చేసిన కల్చరల్ ఫుడ్ బాస్కెట్‌లో మహువ లడ్డులు, సకినాలు, అప్పాలు, బదామ్ కీ జాలి వంటి తెలంగాణ సాంప్రదాయ వంటకాలు ఉండనున్నాయి.

ఈ సమిట్ ద్వారా తెలంగాణ కళలు, సంస్కృతి, వంటకాల ప్రత్యేకతను ప్రపంచ వేదికపై ప్రదర్శించనున్నారు.

# రెండో వన్డేకు అంతా రెడీ



### మళ్లీ రో-కోపైనే అందరి కళ్లు!
### మరో ఆసక్తికర పోరుకు సిద్ధం
### నేడు రాయ్‌పూర్ వేదికగా రెండో వన్డే

సౌతాఫ్రికాతో మూడు వన్డేల సిరీస్‌లో శుభారంభం చేసిన టీమిండియా.. మరో ఆసక్తికర పోరుకు సిద్ధమైంది. నేడు రాయ్‌పూర్ వేదికగా జరిగే రెండో వన్డేలో ఇరు జట్లు అమీతుమీ తేల్చుకోనున్నాయి. తొలి వన్డే తరహాలోనే రెండో మ్యాచ్‌లోనూ విజయం సాధించి మరో మ్యాచ్ మిగిలి ఉండగానే సిరీస్ కైవసం చేసుకోవాలని టీమిండియా భావిస్తోంది. తద్వారా ఆఖరి మ్యాచ్‌లో బెంచ్ ఆటగాళ్లకు అవకాశం ఇవ్వాలనే యోచనలో ఉంది. మరోవైపు తొలి వన్డేలో తృటిలో విజయాన్ని చేజార్చుకున్న సౌతాఫ్రికా.. రెండో మ్యాచ్‌లో విజయం సాధించి సిరీస్ రేసులో నిలవాలనే పట్టుదలతో ఉంది. తొలి మ్యాచ్‌లో కోహ్లీ సెంచరీతో చెలరేగడం.. రోహిత్ శర్మ హాఫ్ సెంచరీతో సత్తా చాటడంతో అప్‌కమింగ్ మ్యాచ్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఇప్పటికే ఇరు జట్లు రాయ్‌పూర్ చేరుకొని ప్రాక్టీస్ కూడా మొదలుపెట్టాయి. అయితే తొలి వన్డేలో రిషభ్ పంత్‌ను పక్కనపెట్టి రుతురాజ్ గైక్వాడ్‌ను ఆడించడం విమర్శలకు దారి తీసింది. ఈ అవకాశాన్ని రుతురాజ్ గైక్వాడ్ సద్వినియోగం చేసుకోలేకపోయాడు. అతను దేశవాళీ క్రికెట్ ఫామ్‌ను కొనసాగించలేకపోయాడు. అయితే రుతురాజ్ గైక్వాడ్‌కు మరో అవకాశం ఇస్తారా? లేక రిషభ్ పంత్‌ను తుది జట్టులోకి తీసుకొస్తారా? అనేది చూడాలి. ఒకవేళ పంత్‌ను ఆడించాలనుకుంటే రుతురాజ్ బెంచ్‌కు పరిమితమవుతాడు. ఈ ఒక్క మార్పు మినహా తుది జట్టును మార్చే అవకాశాలు లేవు. ఓపెనర్లుగా యశస్వి జైస్వాల్, రోహిత్ శర్మ బరిలోకి దిగనున్నారు. తొలి వన్డేలో యశస్వి జైస్వాల్ నిరాశపర్చాడు. శుభ్‌మన్ గిల్ గైర్హాజరీలో అతనికి వచ్చిన అవకాశాన్ని చేజార్చుకున్నాడు. కనీసం ఈ మ్యాచ్‌లోనైనా అతను సత్తా చాటాలి. మరోవైపు రోహిత్ శర్మ సూపర్ ఫామ్‌లో ఉన్నాడు. ఫస్ట్ డౌన్‌లో విరాట్ కోహ్లీ బరిలోకి దిగనున్నాడు. తొలి వన్డేలో అద్భుత శతకంతో కోహ్లీ రెట్టించిన ఉత్సాహంతో ఉన్నాడు. నాలుగో స్థానంలో రుతురాజ్ గైక్వాడ్, రిషభ్ పంత్‌ల్లో ఒకరు బరిలోకి దిగనున్నారు. వాషింగ్టన్ సుందర్ ఐదో స్థానంలో ఆడనుండగా.. కేఎల్ రాహుల్ ఆరో స్థానంలో బ్యాటింగ్ చేయనున్నాడు. సుందర్ విఫలమైనా.. రాహుల్ హాఫ్ సెంచరీతో సత్తా చాటాడు. ఏడో స్థానంలో జడేజా దూకుడుగా ఆడి విలువైన పరుగులు జోడించాడు. స్పెషలిస్ట్ స్పిన్నర్‌గా కుల్దీప్ యాదవ్ ఆడనుండగా.. హర్షిత్ రాణా, అర్ష్‌దీప్ సింగ్, ప్రసిధ్ కృష్ణలు పేసర్లుగా కొనసాగనున్నారు. తెలుగు తేజం నితీష్ కుమార్ రెడ్డితో పాటు ధ్రువ్ జురెల్, తిలక్ వర్మకు నిరాశే ఎదురవ్వనుంది. ఆల్‌రౌండర్ కోటాలో ఆడాల్సిన నితీష్ కుమార్ రెడ్డి పేలవ ఫామ్‌తో ఇబ్బంది పడుతుండటంతో పక్కనపెట్టేసారు. అతని స్థానంలో హర్షిత్ రాణాను ఆడిస్తున్నారు. హర్షిత్ రాణా తొలి వన్డేలో 3 వికెట్లతో సత్తా చాటాడు. అయితే రాంచీ వన్డేలో 349 స్కోర్ చేసినా, భారత్ అతి కష్టంమీద నెగ్గిందనడంలో సందేహం లేదు. భారీ ఛేదనలో సౌతాఫ్రికా ఇన్నింగ్స్ ప్రారంభంలోనే 3 కీలక వికెట్లు కోల్పోయినా, మ్యాచ్ అక్కడదాకా వచ్చిందంటే మన బౌలింగ్? ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. రాయ్?పుర్ పిచ్ స్పిన్నర్లతోపాటు పేసర్లకు కూడా అనుకూలమే. హర్షిత్ రాణా, అర్ష్‌దీప్, కుల్దీప్ వికెట్లు తీసినా భారీగా పరుగులు ఇచ్చుకున్నారు. తొలి మ్యాచ్?లో నుంచి పాఠాలు నేర్చుకొని, అవి రిపీట్ కాకుండా చూడాల్సిన బాధ్యత బౌలర్లదే. ప్రత్యర్థి సౌతాఫ్రికా రాంచీ మ్యాచ్?లో ఓడినా, వాళ్లు పోరాడిన తీరు అందర్నీ ఆకట్టుకుంది. ఓవైపు వికెట్లు పడుతున్నా ఆఖరు బ్యాటర్? దాకా పోరాడారు. ఆ రోజు టార్గెట్ ఓ 30 పరుగులు తక్కువ ఉంటే ఫలితం మారేదేమో! ఇక తొలి వన్డేలో ఓటమితో సౌతాఫ్రికా, రెండో మ్యాచ్?కు మరింత సన్నద్ధంగా తిరిగి వస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. బార్ట్?మాన్, సుబ్రయన్, బర్గర్ బౌలింగ్?లో కీలకం కానుండగా, మార్?క్రమ్, డికాక్, రికెల్?టన్, టోనీ జార్జిలతో సౌతాఫ్రికా బలంగా కనిపిస్తుంది. ఇక ఆల్?రౌండర్ మార్కో యాన్సెన్? ఆ జట్టుకు అతిపెద్ద బలంగా ఉన్నాడు. అతడిని ఎదుర్కోవడం భారత్?కు పెద్ద సవాల్ కానుంది. రాయ్‌పూర్ పిచ్ బ్యాలెన్స్?గా ఉంటుంది. తొలి మ్యాచ్?లాగానే ఇందులోనూ భారీ స్కోర్లు నమోదు అయ్యే అవకాశాలు ఉన్నాయి. స్పిన్నర్లు, పేసర్లు ఇద్దరూ ఈ పిచ్‌పై ప్రభావం చూపుతారు. భారత్?లోని అతిపెద్ద మైదానాలలో రాయ్?పుర్ స్టేడియం ఒకటి. బౌండరీ లైన్లు చాలా దూరంగా ఉంటాయి.

**సౌతాఫ్రికాతో తొలి వన్డే తుది జట్టు(అంచనా)**

రోహిత్ శర్మ, యశస్వి జైస్వాల్, విరాట్ కోహ్లీ, రిషభ్ పంత్/రుతురాజ్ గైక్వాడ్, వాషింగ్టన్ సుందర్, కేఎల్ రాహుల్(కెప్టెన్), రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్, నితీష్ కుమార్ రెడ్డి, అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణా.

రోహిత్ శర్మ, యశస్వి జైస్వాల్, విరాట్ కోహ్లీ, తిలక్ వర్మ, కేఎల్ రాహుల్(కెప్టెన్), కీపర్, రిషభ్ పంత్(కీపర్), వాషింగ్టన్ సుందర్, రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్, నితీష్ కుమార్ రెడ్డి, హర్షిత్ రాణా, రుతురాజ్ గైక్వాడ్, ప్రసిధ్ కృష్ణ, అర్ష్‌దీప్ సింగ్, ధ్రువ్ జురెల్.



## మ్యాక్స్‌వెల్ ఐపీఎల్‌కు గుడ్‌బై


ఆస్ట్రేలియా విధ్వంసకర బ్యాటర్ గ్లేన్ మ్యాక్స్‌వెల్ కూడా ఐపీఎల్‌కు గుడ్‌బై చెప్పాడు. ఐపీఎల్ 2026 మినీ వేలానికి తన పేరును రిజిస్టర్ చేసుకోలేదని తెలిపాడు. క్రికెటర్‌గా ఎదిగేందుకు ఐపీఎల్ తనకు ఎంతో ఉపయోగపడిందని, వరల్డ్ క్లాస్ ప్లేయర్లతో ఆడే అవకాశం దక్కిందని సోషల్ మీడియా వేదికగా ఓ పోస్ట్‌ను పంచుకున్నాడు. ఐపీఎల్ అభిమానుల ప్రేమ వెల కట్టలేనిదని, తనకు సహకరించిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు చెప్పాడు. ఐపీఎల్ రిటైర్మెంట్ గురించి ప్రస్తావించకపోయినా.. హింట్ ఇచ్చాడు. 'ఐపీఎల్‌లో ఎన్నో మరపురాని సీజన్స్ తర్వాత ఈ ఏడాది వేలంలో నా పేరును రిజిస్టర్ చేసుకోవద్దని నిర్ణయించుకున్నాను. ఇది చాలా పెద్ద నిర్ణయం. ఈ లీగ్ నాకు ఇచ్చిన ప్రతిదానికీ ఎంతో కృతజ్ఞతతో ఈ నిర్ణయం తీసుకుంటున్నా. ఒక క్రికెటర్‌గా ఎదిగేందుకు నాకు ఐపీఎల్ ఎంతో ఉపయోగపడింది. వరల్డ్ క్లాస్ ప్లేయర్లతో పాటు అద్భుతమైన ఫ్రాంచైజీలకు ప్రాతినిథ్యం వహించే అవకాశం కల్పించింది. క్రికెట్ అంటే ఎంతో అభిరుచి గల అభిమానుల ముందు ఆడే అవకాశాన్నిచ్చింది. ఐపీఎల్‌లోని జ్ఞాపకాలు, సవాళ్లు, భారత అభిమానుల ఉత్సాహం నాతో శాశ్వతంగా ఉంటాయి. ఇన్నేళ్లుగా మీరు అందించిన మద్దతుకు ధన్యవాదాలు. మళ్లీ త్వరలో కలుస్తామని ఆశిస్తున్నాను'అని మ్యాక్స్‌వెల్ తన పోస్ట్‌లో పేర్కొన్నాడు. ఇప్పటికే ఆండ్రీ రస్సెల్, ఫాఫ్ డుప్లెసిస్ ఐపీఎల్‌కు గుడ్ బై చెప్పిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ జాబితాలో మ్యాక్స్‌వెల్ చేరాడు. వేలంలో అమ్ముడుపోమని గ్రహించే ఈ ముగ్గురు ఆటగాళ్లు మినీ ఆక్షన్‌కు దూరంగా ఉన్నారని క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. 2012లో ఢిల్లీ క్యాపిటల్స్‌తో ఐపీఎల్ కెరీర్ ప్రారంభించిన మ్యాక్స్‌వెల్ ముంబై ఇండియన్స్(2013), పంజాబ్ కింగ్స్ (2014-2017, 2020-21, 2025), ఢిల్లీ క్యాపిటల్స్(2018) రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(2021-2024) మొత్తం నాలుగు జట్లకు ప్రాతినిథ్యం వహించాడు. ఈ నాలుగు జట్ల తరఫున 141 మ్యాచ్‌లు ఆడిన మ్యాక్స్‌వెల్ 23.88 సగటుతో 2819 పరుగులు చేశాడు. ఇందులో 18 హాఫ్ సెంచరీలున్నాయి. పంజాబ్ కింగ్స్ తరఫున గత సీజన్‌లో 7 మ్యాచ్‌లు ఆడిన మ్యాక్స్‌వెల్ 48 పరుగులే చేసాడు. దాంతో ఆ జట్టు అతన్ని వేలంలోకి వదిలేసింది.




## చరిత్ర సృష్టించిన అభిషేక్ శర్మ

టీమిండియా స్టార్ ఓపెనర్, సన్‌రైజర్స్ హైదరాబాద్ విధ్వంసకర బ్యాటర్ అభిషేక్ శర్మ చరిత్ర సృష్టించాడు. టీ20ల్లో 19 బంతుల్లోపు 7 హాఫ్ సెంచరీలు నమోదు చేసిన బ్యాటర్‌గా నిలిచాడు. ప్రతిష్టాత్మక దేశవాళీ టోర్నీలో భాగంగా ఉప్పల్ వేదికగా బరోడాతో జరిగిన మ్యాచ్‌లో పంజాబ్ తరఫున 18 బంతుల్లో హాఫ్ సెంచరీ నమోదు చేయడం ద్వారా ఈ ఫీట్ సాధించాడు. ఐపీఎల్ హోమ్ గ్రౌండ్ అయిన ఉప్పల్‌లో అభిషేక్ శర్మ విధ్వంసకర బ్యాటింగ్‌తో చెలరేగాడు. 19 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్స్‌లతో 50 పరుగులు చేసి లింబానీ బౌలింగ్‌లో క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగాడు. గత ఆదివారం బరోడాతో జింఖాన మైదానంలో జరిగిన మ్యాచ్‌లో అభిషేక్ శర్మ భారీ శతకంతో చెలరేగాడు. 52 బంతుల్లో 148 పరుగులు చేశాడు. అదే జోరును తాజా మ్యాచ్‌లోనూ చూపించాడు. టీ20ల్లో అభిషేక్ శర్మకు 19 బంతుల్లోపు ఇది ఏడో హాఫ్ సెంచరీ. అయితే ఇందులో మూడు హాఫ్ సెంచరీ పంజాబ్ తరఫున సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలోనే నమోదు కాగా.. మరో మూడు ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ తరఫున వచ్చాయి. భారత్ తరఫున ఇంగ్లండ్‌తో జరిగిన మ్యాచ్‌లో 17 బంతుల్లో హాఫ్ సెంచరీ సాధించాడు. ఈ ఏడు హాఫ్ సెంచరీలు కూడా 2024 తర్వాతే నమోదు కావడం గమనార్హం. ఈ ఏడు హాఫ్ సెంచరీలను అభిషేక్ శర్మ 12, 14, 16, 17, 19 బంతుల్లో సాధించాడు. ఈ క్రమంలో అభిషేక్ శర్మ.. కీరన్ పోలార్డ్ ఆల్‌టైమ్ రికార్డ్‌ను అధిగమించాడు. కీరన్ పొలార్డ్ 14, 17, 17, 18, 19, 19 బంతుల్లో 6 హాఫ్ సెంచరీలు నమోదు చేయగా.. ట్రావిస్ హెడ్ 16, 16, 17, 18, 19 బంతుల్లో 5 హాఫ్ సెంచరీలు నమోదు చేశారు. ఈ మ్యాచ్‌లో హార్దిక్ పాండ్యా విధ్వంసంతో బరోడా 7 వికెట్ల తేడాతో గెలుపొందింది. అభిషేక్ శర్మకు తోడుగా అన్మోల్‌ప్రీత్ సింగ్(32 బంతుల్లో 7 ఫోర్లు, 4 సిక్స్‌లతో 69) హాఫ్ సెంచరీతో సత్తా చాటడంతో ముందుగా బ్యాటింగ్ చేసిన పంజాబ్ 8 వికెట్లకు 222 పరుగులు చేసింది. అనంతరం బరోడా 19.1 ఓవర్లలో 3 వికెట్లకు 224 పరుగులు చేసి గెలుపొందింది. హార్దిక్ పాండ్యా(42 బంతుల్లో 7 ఫోర్లు, 4 సిక్స్‌లతో 77 నాటౌట్), శివాలిక్ శర్మ(31 బంతుల్లో 4 ఫోర్లు, సిక్స్‌తో 47 నాటౌట్) పరుగులతో రాణించాడు.

## ఐపీఎల్ 2026 మినీ వేలంలో హోరాహోరీ తప్పదా!




ఇండియన్ ప్రీమియర్ లీగ్ మినీ వేలం ఉత్కంఠభరితంగా జరగనుంది. డిసెంబర్ 16న అబుదాబిలో జరగనున్న ఈ మినీ, కానీ హై-ఇంటెన్సిటీ వేలం కోసం మొత్తం 1,355 మంది ఆటగాళ్లు తమ పేర్లు నమోదు చేసుకున్నారు. ఈసారి భారత్‌కు చెందిన చాలా మంది డొమెస్టిక్ ప్లేయర్లతో పాటు ప్రపంచంలోని టాప్ క్లాస్ అంతర్జాతీయ ఆటగాళ్లు కూడా తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. భారత క్రికెటర్ల జాబితాలో మయాంక్ అగర్వాల్, రవి బిష్ణోయ్, దీపక్ హుడా, కెఎస్ భరత్, వెంకటేష్ అయ్యర్, పృథ్వీ షా, శివం మావి, నవదీప్ సైనీ, చేతన్ సకారియా, రాహుల్ త్రిపాఠి వంటి ఆటగాళ్లు ఉన్నారు. కొత్త సీజన్‌లో తమకు మంచి అవకాశం లభిస్తుందని వారు భావిస్తున్నారు. బీసీసీఐ త్వరలో ఆటగాళ్లందరి బేస్ ప్రైస్‌తో అధికారిక జాబితాను విడుదల చేస్తుంది. క్రికెట్‌బజ్ నివేదిక ప్రకారం, 13 పేజీల ఈ జాబితాలో ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా దేశాలకు చెందిన పలువురు అంతర్జాతీయ క్రికెటర్లు ఐపీఎల్ మినీ వేలంలోకి వచ్చారు. ఆస్ట్రేలియాకు చెందిన కామెరాన్ గ్రీన్, స్టీవ్ స్మిత్, మాథ్యూ షార్ట్ ఇందులో ప్రధాన ఆకర్షణగా నిలిచారు. గత రెండు సీజన్ల నుంచి స్టీవ్ స్మిత్ అమ్ముడుపోవడం లేదు. నిలకడ లేమి, సత్తా చాటే ఇన్నింగ్స్ ఆడకపోవడం.. కీలక సందర్భాలలో జట్టుకు అందుబాటులో ఉండకపోవడం మైనస్ అవుతున్నాయి. 2028 లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్‌లో ఆస్ట్రేలియా టీ20 జట్టులో భాగం కావడానికి ఐపీఎల్‌లో రాణించాలని ఆశగా ఎదురుచూస్తున్నాడు. గ్లెన్ మాక్స్‌వెల్ దారుణ ఆటతీరుతో విసిగిపోయి పంజాబ్ కింగ్స్ సైతం అతడ్ని రిలీజ్ చేసింది. అయితే తాను ఐపీఎల్ మినీ వేలానికి దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నాడు. ఆస్ట్రేలియా వికెట్ కీపర్ జోష్ ఇంగ్లిస్ కూడా రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు. అయితే పెళ్లి కారణంగా అతడు సీజన్ పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంటాడా లేదా అనే దానిపై స్పష్టత లేదు. అయినప్పటికీ, జోష్ ఇంగ్లిష్ వేలంలో పేరు నమోదు చేయడం ద్వారా ఐపీఎల్కి తిరిగి రావాలనే ఆసక్తి ఉన్నట్లు హింట్ ఇచ్చాడు. వేలానికి ముందు కోల్‌కతా నైట్ రైడర్స్ వద్ద ఎక్కువ నగదు ఉంది. ఆండ్రీ రస్సెల్, వెంకటేష్ అయ్యర్‌తో సహా పలువురు స్టార్ ప్లేయర్లను వేలంలోకి విడుదల చేయడంతో కేకేఆర్ వారి పర్సులో అత్యధిక మొత్తం మిగిలి ఉంది. రస్సెల్ ఐపీఎల్ క్రికెట్ నుండి రిటైర్ అయినా, ఈ సీజన్లో కేకేఆర్లో కొత్త ఇన్నింగ్స్ మొదలుపెట్టేందుకు సిద్ధంగా ఉన్నాడు. దీని తరువాత, రెండవ స్థానంలో చెన్నై సూపర్ కింగ్స్ ఉంది. సీఎస్కే ఫ్రాంచైజీ రాహుల్ త్రిపాఠి, దీపక్ హుడా, విజయ్ శంకర్ వంటి ఆటగాళ్లను వేలంలోకి విడుదల చేసింది. ఆశ్చర్యకరంగా శ్రీలంక పేసర్.. జూనియర్ మలింగాగా పిలుచుకునే మతీషా పతిరణాను కూడా సీఎస్కే రిటైన్ చేసుకోకుండా వదిలివేసింది. దాంతో ఈ మినీ వేలంలో పతిరణ కోసం గట్టిగానే బిడ్ జరిగే అవకాశం ఉందని క్రికెట్ విశ్లేషకులు భావిస్తున్నారు. పలువురు భారత స్టార్ ప్లేయర్లను సైతం జట్లు రీటైన్ చేసుకోలేదు. మహ్మద్ షమీ లాంటి స్టార్ పేసర్‌ను సన్‌రైజర్స్ జట్టు రిలీజ్ చేయడం తెలిసిందే.


## అర్జున్ టెండూల్కర్ ఆల్ రౌండర్ షో



క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ కుమారుడు అర్జున్ టెండూల్కర్ ఆల్-రౌండర్‌గా తన ఆటతీరుతో ఆకట్టుకుంటున్నాడు. దేశీయ టీ20 టోర్నమెంట్ అయిన సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో గోవా జట్టు తరఫున ఆడుతున్న అర్జున్, మధ్యప్రదేశ్‌పై జట్టుకు అద్భుత విజయాన్ని అందించాడు. ఈ లెఫ్ట్ హ్యాండ్ బౌలర్ పవర్‌ప్లేలో అద్భుతమైన స్పెల్‌తో కీలక వికెట్లు పడగొట్టి ప్రత్యర్థి జట్టును కట్టడి చేయడంలో ముఖ్యపాత్ర పోషించాడు. గోవా జట్టు ఈ మ్యాచ్‌లో 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. అర్జున్ బౌలింగ్, బ్యాటింగ్‌తో ఈ సీజన్‌లో గోవా తమ రెండో విజయాన్ని నమోదు చేసింది. మధ్యప్రదేశ్ మొదట బ్యాటింగ్ చేసి 170 పరుగులు చేసింది. కానీ అర్జున్ టెండూల్కర్ పవర్‌ప్లేలో వేసిన కీలకమైన స్పెల్ కారణంగా వారు మరింత పెద్ద స్కోరు చేయలేకపోయారు. గోవా తరఫున తొలి ఓవర్‌ను వేసిన అర్జున్, ఐదో బంతికే శివాంగ్ కుమార్ను డకౌట్ చేసి ఖాతా తెరవకుండానే పెవిలియన్ చేర్చాడు. ఆ తర్వాతి ఓవర్‌లోనే మరో కీలక వికెట్ అంకుష్ సింగ్ను కూడా అవుట్ చేశాడు. చివరి ఓవర్లలో కొంచెం ఎక్కువ పరుగులు ఇచ్చినా, అతను వెంకటేష్ అయ్యర్‌ను కేవలం 6 పరుగులకే అవుట్ చేసి తన మూడో వికెట్‌ను సాధించాడు. ఈ మ్యాచ్‌లో గోవా తరఫున బెస్ట్ బౌలింగ్ పర్ఫామెన్స్ (3 వికెట్లు) చేసింది అర్జున్ టెండూల్కరే. మధ్యప్రదేశ్ తరఫున హర్‌ప్రీత్ సింగ్ అజేయంగా 80 పరుగులు చేయగా, కెప్టెన్ రజత్ పాటిదార్ 29 పరుగులు, ఆఖర్లో అంకిత్ వర్మ 4 సిక్సర్ల సహాయంతో 34 పరుగులు చేశారు. మధ్యప్రదేశ్ విధించిన 170 పరుగుల లక్ష్యాన్ని గోవా 18.3 ఓవర్లలో సులభంగా ఛేదించింది. బౌలింగ్‌లో అద్భుత ప్రదర్శన తర్వాత, అర్జున్ టెండూల్కర్ ఓపెనింగ్ బ్యాట్స్‌మెన్‌గా కూడా బరిలోకి దిగాడు. బ్యాటింగ్‌కు రాగానే మూడు ఫోర్లు కొట్టి దూకుడు చూపినా, 16 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద తిరుపరేష్ సింగ్ బౌలింగ్‌లో అవుట్ అయ్యాడు. ఆ తర్వాత అభినవ్ తల్వారేజా, కెప్టెన్ సుయష్ ప్రభుదేసాయి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దారు. వీరిద్దరూ కలిసి 66 బంతుల్లో 89 పరుగుల కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. కెప్టెన్ సుయష్ ప్రభుదేసాయి అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడి అజేయంగా 75 పరుగులు చేశాడు. చివర్లో లలిత్ యాదవ్ తో కలిసి కేవలం 27 బంతుల్లో 57 పరుగులు జోడించి జట్టుకు విజయాన్ని అందించాడు. ఈ విజయంతో సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో గోవా తమ రెండో విజయాన్ని నమోదు చేసుకుంది. అర్జున్ టెండూల్కర్ ఆల్-రౌండర్ ప్రదర్శన, ముఖ్యంగా పవర్‌ప్లేలో అతడు చూపిన బౌలింగ్ పర్ఫామెన్స్, గోవా విజయంలో కీలక పాత్ర పోషించింది.

# హిందీలో అడుగు పెట్టాలంటే ఆర్భాటం తప్పనిసరి

## మళయాల నటుడు దుల్కర్ సల్మాన్




హిందీ, మలయాళ చిత్ర పరిశ్రమల మధ్య ఎంతో వ్యత్యాసం ఉందని నటుడు దుల్కర్ సల్మాన్ అన్నారు. హిందీలో ప్రవేశించాలంటే హంగూ..ఆర్భాటంఅవసరం అన్నారు. లేదంటే మనలను కనీసం చూడకూడా చూడరని వ్యాఖ్యానించారు. భాషతో సంబంధం లేకుండా వరుస సినిమాలతో అలరిస్తున్న దుల్కర్ తాజాగా ఓ ఇంటర్వ్యూలో బాలీవుడ్‌లో పనిచేసిన అనుభవాన్ని పంచుకున్నారు. హిందీ సినిమాలో నటించేటప్పుడు పెద్ద స్టార్ అని అనిపించుకోకపోతే వాళ్లు ఎంతో నిర్లక్ష్యం చేస్తారని అన్నారు. తాను బాలీవుడ్‌లో నటించేటప్పుడు నా చుట్టూ ఎప్పుడూ ఇద్దరు వ్యక్తులు ఉండేవారు. నేను స్టార్ అని అందరినీ నమ్మించాల్సి వచ్చింది. లేకపోతే నాకు కనీసం కూర్చోవడానికి కుర్చీ కూడా ఉండదు. మోనిటర్ చూడడానికి స్థలం కూడా ఇవ్వరు. మన చుట్టూ జనాలు ఉంటేనే వాళ్లు మనల్ని గుర్తిస్తారు. లగ్జరీ కారులో వస్తేనే మనల్ని స్టార్ అనుకుంటారు. అలాంటి భావన దురదృష్టకరం. మలయాళ సినిమా సెట్‌లో పరిస్థితి పూర్తి భిన్నంగా ఉంటుంది. ఎక్కువ ఖర్చు ఉండదు. లగ్జరీకి ప్రాధాన్యం ఇవ్వరు. రాష్ట్రంలో ఎన్నో ప్రాంతాల్లో షూటింగ్ చేస్తాం. ఇంటినుంచి అన్నీ తెచ్చుకుంటాం. ఎక్కువగా సొంత ఖర్చులే పెట్టుకుంటాం అని దుల్కర్ అన్నారు. 2018లో దుల్కర్ కార్వాన్ చిత్రంతో హిందీ చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టారు. ఇటీవలే 'కాంత'తో ప్రేక్షకులను పలకరించారు. సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం డిసెంబర్ 12 నుంచి నెట్‌ఫ్లిక్స్ వేదికగా ప్రసారం కానున్నట్లు వార్తలు వస్తున్నాయి.



# అడల్ట్ కామెడీతో సైక్ సిద్ధార్థ

టాలీవుడ్ యువ నటుడు నందు, యామిని భాస్కర్ జంటగా నటిస్తున్న సినిమా 'సైక్ సిద్ధార్థ'. మీలాంటి యువకుడి కథ అనేది ఉపశీర్షిక. అడల్ట్ కామెడీతో తెరకెక్కుతున్న ఈ మూవీకి వరుణ్ రెడ్డి దర్శకత్వం వహిస్తుండగా ప్రియాంక రెబెకా శ్రీనివాస్, సాక్షి అత్రి, మౌనిక తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. నిర్మాత శ్యామ్ సుందర్ రెడ్డితో పాటు నందు కూడా ఈ చిత్ర నిర్మాణంలో భాగస్వామిగా ఉన్నారు. ఈ చిత్రం డిసెంబర్ 12న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్. ఈ ట్రైలర్ చూస్తుంటే అడల్ట్ కామెడీగా ఈ చిత్రం రాబోతుందని తెలుస్తుంది. ఎక్కువగా బూతులతోనే ట్రైలర్‌ను నింపేశారు.



# సెలబ్రిటీలు మరణిస్తే ఇంత దిగజారుడా

## ఇదేం జర్నలిజం అంటూ వాపోయిన జాన్వీ

సెలబ్రిటీలు మరణించినప్పుడు మీడియా వ్యవహరిస్తోన్న తీరుపై నటి జాన్వీకపూర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. తన తల్లి శ్రీదేవి మరణించినప్పుడు అందరూ తనను టార్గెట్ చేశారని బాధ పడ్డారు. కొందరు తన మాటలను మీమ్స్‌గా కూడా ఉపయోగించుకున్నారని అవి చూసినప్పుడు కలిగిన బాధ మాటల్లో వర్ణించలేనని అన్నారు. తాజాగా లెజెండరీ నటుడు ధర్మేంద్ర మృతి చెందినప్పుడు కూడా మీడియా అత్యుత్సాహం చూపించిందని అది నిజమైన జర్నలిజం కాదని జాన్వీ అసహనం వ్యక్తంచేశారు.తన తల్లి మరణించినప్పుడు టీవీ చూడడానికి కూడా భయం వేసిందని జాన్వీ అన్నారు. అమ్మ మరణంపై ఎన్నో అవాస్తవాలు రాశారు. ఒక కూతురుగా ఎంతో గందరగోళానికి గురయ్యాను. ఎప్పటికీ కోలుకోలేనేనని భయపడ్డా. ఆ తర్వాత అన్నీ అర్థం చేసుకొని నా పనిపై దృష్టిపెట్టాను అని జాన్వీ చెప్పారు. తాను ఇండస్ట్రీలోకి రావడానికి కొన్ని నెలల ముందే మా అమ్మ ఈ లోకాన్ని విడిచిపెట్టింది. నా తొలి చిత్రం ప్రచారంలో నేను మా అమ్మను గుర్తుచేసుకుంటూ చెప్పిన మాటలపై కొందరు మీమ్స్ చేశారు. నన్ను టా÷-గ్గ÷ట్ చేసి మాట్లాడేవారు. అవి చూసి కొన్ని రోజులు అన్నిటికీ దూరంగా ఉన్నాను. ఆ కాలాన్ని నేను ఇప్పటికీ మర్చిపోలేను. ఆ సమయంలో నేను ఏది చెప్పినా అది అందరికీ తప్పుగానే అనిపించేది. తల్లి మరణంపై కుమార్తె బాధ పడితే దాన్ని కూడా అపహాస్యం చేస్తారని ఎవరైనా ఊహించగలరా. ధర్మేంద్ర విషయంలో కొందరు మరింత దిగజారి ప్రవర్తించారు. సెలబ్రిటీల విషయంలో ఇలా జరగడం ఇదే తొలిసారి కాదు.. వ్యూస్, లైక్స్ కోసం ఇష్టం వచ్చింది రాస్తున్నారు. ఇలాంటి ధోరణిని ప్రోత్సహించకూడదని జాన్వీ అన్నారు.



### యానిమల్ ఛాన్స్ వచ్చివుంటే తిరస్కరించే దాన్ని: రసిక దుగల్

బాలీవుడ్ నటి రసిక దుగల్ మరోసారి తన సంచలన వ్యాఖ్యలతో వార్తల్లో నిలిచింది. పితృస్వామ్యాన్ని ప్రోత్సహించే సినిమాలను తాను ఎప్పటికీ అంగీకరించబోనని స్పష్టం చేసింది. ఈ సందర్భంగా బాలీవుడ్‌లో భారీ విజయం సాధించిన 'యానిమల్' వంటి సినిమా ఆఫర్ తనకు వస్తే తాను 'నో' చెప్పేదానినని తెలిపింది. 'మిర్జాపూర్', 'ఢిల్లీ క్రైమ్' వంటి పాపులర్ వెబ్ సిరీస్‌లతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న రసిక దుగల్.. సినిమాలను ఎంచుకునే విషయంలో తన విధానాన్ని తాజాగా ఒక ఇంటర్వ్యూలో పంచుకుంది. నేను ఎంచుకునే ప్రతి సినిమా యొక్క రాజకీయాలు నాకు చాలా ముఖ్యం. కేవలం పైపైన చూడడం కాకుండా, అది నా నిర్ణయాలకు మూలస్తంభంగా నిలుస్తుంది. ఒకవేళ నాకు 'యానిమల్' వంటి సినిమాలో అవకాశం వచ్చి ఉంటే దానికి నేను ఖచ్చితంగా 'నో' చెప్పేదాన్ని. ఎందుకంటే పితృస్వామ్యాన్ని ప్రోత్సహించే ప్రాజెక్ట్‌ను నేను ఒకరోజు అంగీకరిస్తానేమోననేదే నా అతిపెద్ద భయం అని రసిక దుగల్ అన్నారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది.

# బంధం ఉన్నంత వరకే కొనసాగుతుంది

## రాజ్‌నిడుమోరు మాజీ భార్య శ్యామాలి



తెగించిన వ్యక్తులు దానికి తగినట్లుగానే వ్యవహరిస్తారని దర్శకుడు రాజ్ నిడిమోరు, నటి సమంత వివాహబంధంపై రాజ్ మాజీ భార్య శ్యామాలి ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఎన్నో రోజులుగా వస్తోన్న రూమర్స్‌కు చెక్ పెడుతూ దర్శకుడు రాజ్ నిడిమోరు, నటి సమంత వివాహబంధంతో ఒక్కటయ్యారు. ఈ జంటకు నెటిజన్లు, సెలబ్రిటీలు శుభాకాంక్షలు తెలుపుతోన్న వేళ.. రాజ్ మాజీ భార్య శ్యామాలి పోస్ట్ ప్రస్తుతం వైరల్ అవుతోంది. ఎప్పుడూ తన ఆలోచనలను సోషల్ మీడియా వేదికగా పంచుకునే ఆమె తాజాగా ఒక పోస్ట్‌ను షేర్ చేశారు. 'ఈ అనంత విశ్వంలో మనం ఒక మూల ఉన్నాం' అని అర్థం వచ్చేలా ఒక ఇమేజ్ షేర్ చేశారు. రాజ్ – సమంతల వివాహం జరిగిన రోజు సోమవారం కూడా శ్యామాలి పెట్టిన పోస్ట్ చర్చనీయాంశంగా మారింది. తెగించిన వ్యక్తులు దానికి తగినట్లుగానే వ్యవహరిస్తారని ఆమె రాసుకొచ్చారు. అలాగే, మనతో రుణం ఉన్నంత వరకే బంధాలు అన్నీ ఉంటాయి. రుణం తీరిన తర్వాత బంధం శాశ్వతంగా దూరమవుతుందని శ్యామాలి ఐదు రోజుల క్రితం తన ఇన్‌స్టాలో పోస్ట్ పెట్టారు.



### సమంత దంపతులు అమెరికాలో సెటిల్ అవుతారా?

రాజ్, సమంతల వివాహంపై గతంలో జ్యోతిష్యుడు చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు వైరల్ అవుతున్నాయి. 2023 జూన్ 27న ఆయన చేసిన ట్వీట్‌లో .. సమంత 2024లో ప్రేమలో పడుతుంది, 2025లో రెండో పెళ్లి చేసుకుంటుంది, 2026లో భర్తతో కలిసి అమెరికాలో సెటిల్ అవుతుందని పేర్కొన్నారు. ఈ జోష్యంలో ముందటి రెండు విషయాలు నిజమవడంతో, ఇప్పుడు మూడో అంశం సమంత 2026లో అమెరికాకు వెళ్లి సెటిల్ అవుతుందా? అని నెటిజన్స్ ముచ్చటించుకుంటున్నారు. ఈ క్రమంలో ప్రశాంత్ కినీ కూడా తాజాగా స్పందిస్తూ, సమంత విషయంలో నేను చెప్పిన జ్యోతిష్యం నిజమైంది అని మరోసారి పోస్ట్ చేశారు. అయితే సమంత 2026లో అమెరికాలో సెటిల్ అయితే?ఆమె సినిమాలకు గుడ్‌బై చెబుతుందా? ఇకపై టాలీవుడ్ ప్రాజెక్టుల్లో కనిపించదా? అంటూ అభిమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

Editor, Publisher & Owner by Reddy Shekar,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48 SS Printers, (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, E Mail : teenmaardesk@gmail.com, Cell : 9966847463